## ఆరోగ్యం పట్ల అప్రమత్తతతో ఉండాలి





# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd


## ఎంపీడీవో కార్యాలయంలో వారాంతపు సమీక్ష సమావేశం





Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 102 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 09 ఏప్రిల్ 2026


## 40 రోజుల యుద్ధంతో ఏం సాధించారు

### - కాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా



**శ్రీనగర్,ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇరాన్‌పై 40 రోజుల యుద్ధంతో అమెరికా ఏమి సాధించిందని జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రశ్నించారు. హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరిచేందుకు సిద్ధంగా ఉండాలనే షరతుపై మధ్యప్రాచ్యంలో రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకరించిన సంగతి తెలిసిందే. కాల్పుల విరమణలో భాగంగా వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరిచారన్న మీడియా నివేదికలపై బుధవారం ఆయన స్పందించారు. యుద్ధ ప్రారంభం కావడానికి ముందే ఆ మార్గం 'తెరిచి వుండటంతో పాటు స్వేచ్ఛగా అందుబాటులో' ఉందని అన్నారు. ఈ 39 రోజుల యుద్ధం అమెరికా ఏమి సాధించిందని ఎక్స్‌లో పేర్కొన్నారు. 'అన్యాయమైన యుద్ధం' అని హ్యాష్ టాగ్ పోస్ట్ చేశారు.

# ఖర్చుగా కాదు... భాగస్వామ్యంగా చూడండి....

### ప్రాధాన్య రంగాలను మీరే ఎంచుకోండి...

### అవసరమైన సహకారం మేం అందిస్తాం...

### సిఎస్ఆర్ నిధులపై కంపెనీల ప్రతినిధులతో రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** సమాజాభివృద్ధికి చేసేది ఖర్చుగా కాకుండా భాగస్వామ్యంగా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. సీఎస్ఆర్ నిధులకు సంబంధించి వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కంపెనీలు సీఎస్ఆర్‌కు చేస్తున్న వ్యయం వందకు వంద శాతం సత్ఫలితాలు ఇచ్చేలా ఉండాలన్నారు. తమ ప్రభుత్వం విద్యా, వైద్యం, జల వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తుందని తెలియజేశారు. కంపెనీలు వీటితో పాటు తమకు ఇష్టమైన ఏ రంగాన్నైనా ఎంచుకొని సీఎస్ఆర్ నిధులు వినియోగించాలని సూచించారు. ప్రభుత్వంతో పాటు కంపెనీలు కలిపి చేసే వ్యయంతో తెలంగాణ విద్యార్థులను ప్రపంచ స్థాయి నైపుణ్యం ఉన్న వారిగా తీర్చిదిద్ది భవిష్యత్ అవకాశాలను వారు అందిపుచ్చుకునేలా తయారు చేయగలమని సీఎం అన్నారు. విద్యపై పెట్టే వ్యయాన్ని తాము భవిష్యత్ తరాలపై పెట్టే పెట్టుబడిగా భావిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థుల సంఖ్యలో హైదరాబాద్ నగరంలోనే 44 శాతం ఉన్నారని.. వారికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. కంపెనీలు స్థానికంగా ఉన్న అన్ని మౌలిక వసతులను వినియోగించు కుంటున్నందున తమ సీఎస్ఆర్ నిధుల్లో ఎక్కువ మొత్తాన్ని మిగతా2లో...



# కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు


### ఖరీఫ్ సీజన్ కోసం న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీ

### రూ.41,533.81 కోట్లు కేటాయింపు

### జైపూర్ మెట్రో ఫేజ్-2కు ఆమోదం

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారంనాడు జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 5 కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఖరీఫ్ సీజన్ కోసం న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీగా రూ.41,533.81 కోట్లు కేటాయించారు. ఇది 2025 ఖరీఫ్ సీజన్‌లో బడ్జెటరీ కేటాయింపుల కంటే రూ.4,313 కోట్ల రూపాయలు అధికం. 2025 ఖరీఫ్ బ్జడెట్ రూ.37,216.15 కోట్లుగా ఉంది. కాగా, జైపూర్ మెట్రో ఫేజ్-2కు కేంద్ర క్యాబినెట్ తాజాగా ఆమోదం తెలిపింది. రూ.13,038 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపడతారు. ప్రహ్లాద్‌పుర నుంచి తోడి-మోడ్ వరకూ 36 స్టేషన్లను కలుపుతూ 41 కిలోమీటర్ల పొడవైన నార్త్-సౌత్ మిగతా2లో...

## రెండు వారాల పాటు కాల్పుల విరమణ: డోనాల్డ్ ట్రంప్



**హైదరాబాద్,ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్‌పై అర్ధరాత్రి జరగాల్సిన దాడులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సోషల్‌మీడియా వేదికగా ప్రకటించారు. రెండు వారాల పాటు కాల్పుల విరమణ అమల్లో ఉంటుందని తెలిపారు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, సైన్యాధ్యక్షుడు ఆసిమ్ మునీర్‌తో చర్చల అనంతరం ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్‌పై ఈ రాత్రి జరగాల్సిన దాడులను నిలిపివేయాలని వారు చేసిన ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా చెప్పారు. హోర్ముజ్ జలసంధిని తక్షణమే తెరవాలన్న షరతుకు లోబడి రెండు వారాల గడువు ఇచ్చేందుకు, కాల్పుల విరమణకు అంగీకరించానని ట్రంప్ తెలిపారు. ఇరాన్ నుంచి 10 సూత్రాలతో ఒక ప్రతిపాదన అందిందని.. దానిపై సానుకూలంగా చర్చలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గతంలో ఉన్న వివాదాస్పద అంశాల్లో చాలా వాటిపై రెండు దేశాల మధ్య అంగీకారం కుదిరిందని తెలిపారు. ఈ రెండు వారాల వ్యవధిలో తుది ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.




## సిఎం రేవంత్‌తో ఘనా హైకమిషనర్ భేటీ

### - సిఎంతో భేటీ అయిన టాటా ఏరో స్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ టిమ్ రైఫిల్

**హైదరాబాద్,ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఘనా హైకమిషనర్ క్వాసి ఒబిరి-డాన్సో మర్యాదపూర్వకంగా కలిసిన రిపబ్లిక్ ఆఫ్ మిగతా2లో...

## యధాతథంగా కీలక వడ్డీరేట్లు

### - ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రా



**ముంబై,ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** కీలక వడ్డీ రేట్లను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వరుసగా రెండోసారి కూడా యధాతథంగా ఉంచింది. ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తాజాగా వెల్లడించారు. ఈసారి కూడా రెపో రెటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నామని ప్రకటించారు. దేశ ఆర్థిక వృద్ధిపై ఆశావహ అంచనాలు వెల్లడించిన ఆర్బీఐ గవర్నర్, అంతర్జాతీయ పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్బీఐ రెపో రేట్లను ఆర్బీఐ యధాతథంగా ఉంచడం వరుసగా ఇది రెండోసారి. గత ఫిబ్రవరిలో మిగతా2లో...

## జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ భవితవ్యంపై ఉత్కంఠ

### విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం

### తీర్పును 22కు వాయిదా వేసిన హైకోర్టు




## ఎక్కడ ఎన్నికలు జరిగినా తెలంగాణయే ఎటిఎం

### ఢిల్లీకి గులంగిరీ చేస్తోన్న రేవంత్ ప్రభుత్వం

### కొత్త పార్టీతో సామాన్యలకు అండగా నిలుస్తాం

### కాంగ్రెస్ అవినీతిపై ఇక నిరంతరంగా నిలదీస్తాం

### ఏప్రిల్ 25 చరిత్రను మార్చే రోజు అవుతుంది

### జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు







## మంత్రులపై బురదజల్లడమే బిఆర్ఎస్ పని...

### వారికున్న బురదను మాకు అంటించాలని యత్నం

### నాదర్ గుల్, వట్టినాగులపల్లి భూమలుపై నిందలు

### హరీష్‌కు వాటా దక్కక పోవడంతో ఇప్పుడు విమర్శలా

### మండిపడ్డ మంత్రి పొంగులేటి



## కాళేశ్వరం మోటర్లను దెబ్బతీసే కుట్రలు

### సరైన మెయింటెనెన్స్ లేకుండా చేస్తే ఎలా?

### మంత్రి ఉత్తమ్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ

**హైదరాబాద్,ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాళేశ్వరానికి సంబంధించి భారీ నీటిపారుదల మోటార్లను ధ్వంసం చేసే కుట్ర సాగుతోందంటూ కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ధ్వజమెత్తారు. భారీ నీటిపారుదల మోటార్లను ఇష్టానుసారంగా ఆన్, ఆఫ్ చేయడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు.ప్రాజెక్టుల్లోని భారీ మోటార్లను నిబంధనలకు విరుద్ధంగా పదే పదే ఆన్, ఆఫ్ చేస్తూ అశాస్త్రీయంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇలా చేస్తే వైబ్రేషన్స్ వచ్చి పంపులు, ఇంప్లర్స్, మోటార్స్ పాడయ్యే మిగతా2లో...

## తెలంగాణలో మరో రెండు ఎయిర్‌పోర్టులు

### వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులకు త్వరలో శంకుస్థాపన

### వెల్లడించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



**హైదరాబాద్,ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రజలకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు గుడ్ న్యూస్ చెప్పారు. రాష్ట్రంలో మరికొన్ని రోజుల్లో రెండు నూతన విమానాశ్రయాలు నిర్మించబోతున్నట్లు ప్రకటించారు. వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎయిర్‌పోర్టులు నిర్మించనున్నట్లు తెలిపారు. వరంగల్ విమానాశ్రయానికి మూడు నెలల్లో శంకుస్థాపన జరగనుందని కేంద్ర మంత్రి శుభవార్త చెప్పారు. అలాగే ఆదిలాబాద్‌లోనూ మరో కొత్త ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని కేంద్ర రక్షణ శాఖ నిర్ణయం తీసుకుందని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

మిగతా2లో...

# ఖర్చుగా కాదు... భాగస్వామ్యంగా చూడండి....

(మొదటి పేజీ తరువాయి)

అదే ప్రాంత అభివృద్ధికి కేటాయించాలన్నారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంలో ఇప్పటి వరకు సరైన విధానం లేనందున తాము ఒక ప్రత్యేక ప్రధాన కార్య దర్శిని ఇందుకు నియమించామని సీఎం తెలిపారు. కంపెనీల ప్రతినిధులు ఆయనతో సమన్వయం చేసుకొని తమకు ఆసక్తి ఉన్న విద్యా, వైద్యం, జల వనరులు, నైపుణ్య శిక్షణ, వారసత్వ కట్టడాల పరిరక్షణ, అడవుల సంరక్షణ ఇలా దేనికైనా సీఎస్ఆర్ నిధులు వినియోగించవచ్చని సీఎం తెలిపారు. ఇప్పటికే రహేజా గ్రూప్ రూ.50 కోట్లు, రాంకీ గ్రూప్ రూ.50 కోట్లు, యశోద ఫౌండేషన్ రూ.10 కోట్లు విద్యాభి వృద్ధికి కేటాయించేందుకు ముందుకు వచ్చాయని.. వారికి సీఎం అభినందనలు తెలిపారు. కంపెనీల ప్రతినిధులు స్పందిస్తూ సీఎస్ఆర్ నిధుల విషయంలో ఇప్పటి వరకు ఇలా ఎవరూ తమను సంప్రదించలేదని తెలిపారు. ఈ విషయంలో చొరవ తీసుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. పాఠశాల విద్యా, ఆసుపత్రులు, వారసత్వ కట్టడాల పరిరక్షణకు వారు ఆసక్తి చూపారు.. సమావేశంలో రహేజా ఫౌండేషన్ నుంచి శ్రావణ్ కుమార్, రాంకీ ఫౌండేషన్ నుంచి దాక్షయణి ఆళ్ల, యశోద ఆసుపత్రి నుంచి డాక్టర్ గోరుకంటి సురేందర్ రావు, గోరుకంటి ఫల్గుణ్ రావు, మేఘా నుంచి సుధా రెడ్డి, అపోలో ఆసుపత్రి నుంచి అపర్ణా రెడ్డి, కామినేని భాస్కర్ రెడ్డి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుంచి శేఖర్ రెడ్డి, పగిడిపాటి దేవయ్య, రుద్రమదేవి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి వెంకటేష్ ధోత్రే, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

# జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ భవితవ్యంపై ఉత్కంఠ

**హైదరాబాద్,ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ భవితవ్యంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ కమిషన్ ఏర్పాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు తీర్పును ఈ నెల 22కు వాయిదా వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణల్లో అవకతవకలపై విచారణ నిమిత్తం ఏర్పాటు చేసిన జస్టిస్ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్‌లపై ఇప్పటికే కోర్టు వాదనలు విన్నది. బుధవారం తీర్పు వెలువరించాల్సి ఉండగా.. తీర్పును వాయిదా వేసింది. జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ ప్రభుత్వం 2024 మార్చి 14న జీవో 6ను జారీ చేసింది. దీన్ని సవాలు చేస్తూ భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్, ఐఏఎస్ మాజీ అధికారి ఎస్.కె.జోషిలు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణలో జరిగిన అవకతవకలపై విచారణకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చెల్లుబాటుపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. అయితే, ఈ వ్యవహారంపై తీర్పును ధర్మాసనం ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసింది. కాళేశ్వరం అవకతవకలపై విచారణ కోసం 2024 మార్చి 14వ తేదీన ప్రభుత్వం జీవో నంబర్ 6ను జారీ చేస్తూ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. ఈ జీవోను సవాల్ చేస్తూ రాష్ట్రంలోని పలువురు కీలక నేతలు, అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చేపట్టిన విచారణ ప్రక్రియలో నిబంధనల ఉల్లంఘనలు జరిగాయని పిటిషనర్లు పేర్కొన్నారు. తమపై అభియోగాలు మోపే ముందు, తమ వాదనలను కమిషన్ పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా విచారణ సాగుతోందని వారు కోర్టుకు విన్నవించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలను వెలికితీసేందుకే జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. కమిషన్ తన నివేదికను అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగానే సిద్ధం చేసిందని కోర్టుకు తెలిపింది. విచారణలో భాగంగా పిటిషనర్లందరికీ నోటీసులు ఇచ్చి, నిబంధనల ప్రకారమే ముందుకు వెళ్తున్నామని, కాబట్టి ఈ పిటిషన్లను కొట్టివేయాలని ప్రభుత్వం కోరింది. చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని బెంచ్ ఇరుపక్షాల వాదనలను సుదీర్ఘంగా విన్న తర్వాత, నేడు వెలువరించాల్సిన తీర్పును ఈ నెల 22వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

# ఎక్కడ ఎన్నికలు జరిగినా తెలంగాణయే ఏటీఎం

**హైదరాబాద్,ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశంలో ఎక్కడ ఎన్నికలు వచ్చినా సరే కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఢిల్లీకి ఘోరమైన గులాంగిరి చేస్తోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫోన్ చేస్తే ఫోన్‌లో మాట్లాడేటప్పుడు కూడా రేవంత్‌రెడ్డి నిలబడే మాట్లాడుతున్నారని.. లేదంటే తన కుర్చీకి ఎక్కడ ఎసరు వస్తుందోనని భయపడుతున్నారని సెటైర్లు గుప్పించారు. బుధవారం తెలంగాణ జాగృతిలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గొంగళ్ల రంజిత్ కుమార్, ఆయన అనుచరులు చేరారు. కండువా కప్పి జాగృతిలోకి కవిత ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. రాసి పెట్టుకోండి.. తెలంగాణ భవిష్యత్, చరిత్రను మార్చే రోజు ఏప్రిల్ 25 అవుతోందని కవిత ఉద్ఘాటించారు. కొత్త నెత్తురు, కొత్త రాజకీయాలను ఈ గడ్డకు పరిచయం చేస్తానని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నిస్తాం, పోరాడుతాం, పరిష్కరిస్తామని చెప్పుకొచ్చారు. పప్పన్నం తింటాం, ప్రజల మధ్యలో ఉంటామని.. వారితోనే కలిసి పనిచేస్తామని మాటిచ్చారు. సామాన్యులతో, సామాన్యుల కోసం, సామాన్యులే ఉండేలా రాజకీయం తెస్తామని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అధికార పక్షం కాంగ్రెస్, ప్రతిపక్షం బీఆర్ఎస్ ప్రజల సమస్యలను ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. ప్రజల సమస్యల గురించి ప్రశ్నించేదెవరు అంటే ప్రతినోట జాగృతియే అనే మాట వస్తోందని చెప్పారు. ప్రజల సమస్యల గురించి కాంగ్రెస్ హై కమాండ్‌ని పైసలు అడిగితే నో రాహుల్ జీ అని రేవంత్‌రెడ్డికి సమాధానం చెబుతున్నారని అన్నారు. కానీ కేరళ ఎన్నికల కోసం ఎంత ఖర్చయినా పెడుతున్నారని విమర్శించారు. అప్పర్ తుంగభద్రకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇస్తే రేవంత్‌రెడ్డి ఎందుకు సైలెంట్‌గా ఉన్నారని ప్రశ్నించారు. జాతీయ హోదా కారణంగా తుంగభద్రకు నీళ్లు రాక నష్టపోయేది ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాయేనని.. కానీ ఈ విషయంలో రేవంత్‌రెడ్డి ఎందుకు మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదని నిలదీశారు. అటు కాంగ్రెస్‌ను, ఇటు బీజేపీని మెయింటెయిన్ చేస్తూ ప్రజలను మాత్రం మోసం చేస్తున్నారని ఆగ్రహించారు. తెలంగాణ జాగృతి తరఫున వచ్చే పార్టీ.. ప్రజల సమస్యలపై పోరాటం చేస్తుందని భరోసా కల్పించారు. అంతర్జాతీయ స్థాయిలో నిపుణులతో సమావేశమై ప్రజల కోసం అద్భుతమైన అజెండా రూపొందిస్తున్నానని చెప్పుకొచ్చారు. కొత్త తరహా రాజకీయాలు, ప్రజల కోసం మంచి చేసే రాజకీయాలు ఎలా ఉంటాయో చూపిస్తామని కవిత పేర్కొన్నారు.

## మంత్రులపై బురదజల్లడమే బిఆర్ఎస్ పని...

**హైదరాబాద్,ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** నాదర్‌గుల్ భూముల విషయంలో భారత రాష్ట్ర సమితి నేత హరీశ్ రావు దుష్ప్రచారం చేస్తున్నారని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. సర్వే నంబర్ 613లోని భూములను 2014లో మూడు సంస్థలకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేసిందని తెలిపారు. భూముల మ్యుటేషన్ జరిగిన 2016లోనూ వారి ప్రభుత్వమే ఉందన్నారు. 2014, 2016లో జరిగిన రిజిస్ట్రేషన్లతో ఈ ప్రభుత్వానికి ఏం సంబంధమని ప్రశ్నించారు. హరీశ్ రావు చెబుతున్న భూముల్లో 2022లోనే నిర్మాణాలు ప్రారంభించారు. భూములు పొందిన వారు నాలా కన్వర్షన్ ఇవ్వట్లేదని 2022లోనే సుప్రీంకోర్టుకు వెళ్లారు. వాళ్లు కోర్టుకు వెళ్తే బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం కౌంటర్ కూడా దాఖలు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. అవి ప్రభుత్వ భూములు అని చెప్పి మేం కౌంటర్ వేశాం అని అన్నారు.. ఆనాడు వాటాల ఒప్పందం చేసుకుని భూములు కట్టబెట్టి ఇవాళ మా మీద నిందలు వేస్తున్నారు. నాదర్ గుల్ భూముల్లో వాటా రాకపోవడంతో హరీశ్ రావు ఇవాళ తెరపైకి తెచ్చారని మండిపడ్డారు. ప్రొహిబిటెడ్ భూముల్లో ఈ ప్రభుత్వం ఎలాంటి మార్పులు చేయలేదు. హరీశ్ రావు చెబుతున్న కంపెనీల్లో నా కుటుంబ సభ్యులెవరూ లేరు. నా కుటుంబ సభ్యులు ఉన్నారని నిరూపించాలని సవాల్ చేస్తున్నా. వట్టి నాగులపల్లి భూముల్లోనూ హరీశ్ రావు పూర్తిగా దుష్ప్రచారం చేస్తున్నారు. కుటుంబ సభ్యుల వివాదాన్ని కూడా ఈ ప్రభుత్వానికి అంటగట్టారని మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రభుత్వంపై అసత్యాలు ప్రచారం చేయడమే బీఆర్ఎస్ నేతలు పనిగా పెట్టుకున్నారంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణిలో అవకతవకలని ఉప ముఖ్యమంత్రిపై తప్పుడు ప్రచారం చేశారని అన్నారు. సన్న బియ్యం పట్ల ప్రజల్లో వచ్చిన ఆదరణ జీర్ణించుకోలేక పౌర సరఫరాలో అవినీతి అంటూ మంత్రి ఉత్తమ్ పై మరో పుకారు పుట్టించారని అన్నారు. లిక్కర్ బాటిల్స్ కి వేసే స్టిక్కర్ల విషయంలో, టెండర్ల విషయంలో అవకతవకలు అంటూ లిక్కర్ విషయంలో ఎక్సయిజ్ శాఖ మంత్రి జూపల్లి మీద కూడా అదే రకంగా నిందలు వేశారని మండిపడ్డారు. దేశంలో కొన్ని రాష్ట్రాల్లో చేపట్టే హ్యామ్ సిస్టంలో రోడ్ల నిర్మాణం చేపడితే... బీఆర్ఎస్ ఉనికికి ప్రమాదం వస్తుందని.. మంత్రి కోమటిరెడ్డిపై తప్పుడు ప్రచారం చేశారని.. క్రషర్లు అంటూ తనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని పొంగులేటి అన్నారు. ఇలా ప్రతి మంత్రి మీద తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతల మీద ఉన్న బురదను ప్రభుత్వం మీద చల్లితే..వారు శుభ్రంగా ఉంటామని భ్రమలలో బతుకుతూ అసత్యాలని నిజాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు.

## ఐదు రాష్ట్రాల ఎన్నికల తరవాత ఫోకస్

**ప్రధాని మోడీ ఏం ఆలోచిస్తారో ఎవ్వరికీ తెలియదు**

**నితిన్ నబీని అధ్యక్షుడిని చేస్తారని ఎవ్వరూ ఊహించలేదు**

**మీడియాతో బిజెపి ఎంపి లక్ష్మణ్ సంచలన వ్యాఖ్యలు**



**హైదరాబాద్,ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత తెలంగాణపై ఫోకస్ చేస్తామని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ స్పష్టం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి అనుకూలంగా ఉన్నా.. రేవంత్ వైపు గాలి వీచిందని తెలిపారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎంపీ లక్ష్మణ్ విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ప్రధాని మోదీ ఏం ఆలోచిస్తారో రెండో వ్యక్తికి కూడా తెలియదన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితీన్ నబీన్‌ను ఎంపిక చేస్తారని ఎవ్వరూ ఊహించలేదని తెలిపారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ నిలబడడం అంతా ఈజీ కాదని చెప్పారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అడిగే ప్రశ్నలకు ఎవ్వరూ సమాధానం చెప్పడం లేదన్నారు. అయితే కవిత ప్రస్తుతం ప్రస్తావిస్తున్న అంశాలు.. ఆమె బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడే మాట్లాడి ఉంటే బాగుండేదని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందని ఎవరూ ఊహించలేదన్నారు. తెలంగాణ ప్రజలు తెలివైన వారని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 8 సీట్లు వచ్చినా.. 38 శాతం ఓట్లు ప్రజలు ఇచ్చారని ఎంపీ లక్ష్మణ్ వివరించారు. వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీదే పైచేయి అవుతుందని ఈ సందర్భంగా ఆయన జోస్యం చెప్పారు. ఒక ఎన్నిక తీసుకుని ఎప్పుడూ అంచనా వేయడం తప్పు అని అభిప్రాయపడ్డారు. మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లు తరువాత.. మొత్తం వన్ సైడేనని అన్నారు. ఇప్పటికే మహిళా బిల్లును ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయనే విషయం ప్రజల్లోకి వెళ్లిందని తెలిపారు. బట్ట కాల్చి మీద వేస్తే.. ప్రజలు అంత అమాయకులు కాదన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చునని చెప్పారు. తమిళనాడులో టీవీకే పార్టీ అధినేత విజయ్ సమావేశాలకు ప్రజలు భారీగా వస్తున్నారని.. కానీ ఆ పార్టీ జస్ట్ 5 లేదా 6 సీట్ల కంటే ఎక్కువ గెలవదన్నారు. తెలంగాణలో హెట్ స్పీచ్ బిల్లు తెచ్చి పకడ్బందీగా అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి గతంలో ప్రకటించారని ఎంపీ లక్ష్మణ్ గుర్తు చేశారు.

# కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు

(మొదటి పేజీ తరువాయి)

కారిడార్‌గా దీన్ని నిర్మించనున్నారు. కేంద్ర, రాజస్థాన్ ప్రభుత్వం జాయింట్ వెంచర్‌గా రాజస్థాన్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ దీనిని చేపడుతుంది. ÷రాజస్థాన్‌లో హెచ్‌పీసీఎల్ ర్గి÷నైర్ కోసం రూ.79,459 కోట్లను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని కమ్లే, క్రా దాది-కురుంగ్ కుమే జిల్లాల్లో రూ.26,069.50 కోట్లతో 1720 మెగావాట్ల ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ నిర్మాణానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు 96 నెలల్లో పూర్తవుతుందని అంచనా వేశారు. కాగా, అరుణాచల్ ప్రదేశ్‌లోని అంజావ్ జిల్లాలో 1200 మెగావాట్ల కళాయి-2 హైడ్రో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.14,105.83 కోట్లు కేటాయిస్తూ కేంద్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది.

# సిఎం రేవంత్‌తో ఘనా హైకమిషనర్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ఘనా హైకమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా హైదరాబాద్ కు వచ్చిన క్వాసి ఒబిరి-డాన్ సిఎంను ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఘనా, తెలంగాణ మధ్య సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించిన హైకమిషనర్. విద్య, శాస్త్ర సాంకేతిక రంగాలు, ఆరోగ్య, వాణిజ్య రంగాల్లో పరస్పర సహకారం ఉండాలని కోరిన హైకమిషనర్. ానుకూలంగా స్పందించిన సీఎం రేవంత ఆయనకు శాలువాతో సన్మానించారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టాటా ఏరో స్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ టిమ్ రైఫిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. భారతదేశంలో ఎప్-130ఏ సూపర్ హెర్క్యులస్ ఫైనల్ అసెంబ్లీ లైన్‌ను ఏర్పాటు చేయనున్న లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ. అంతర్జాతీయ అవసరాల కోసం భారతదేశంలోని టిఎఎస్ఎల్ లో ఈ-16 వింగ్స్ ను ఉత్పత్తి చేసేందుకు లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నది. తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నట్లు ఈ సందర్భంగా టిమ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

# యధాతథంగా కీలక వడ్డీరేట్లు

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన సమీక్షలో కూడా వడ్డీ రేట్లలో ఆర్బీఐ ఎలాంటి మార్పులూ చేయలేదు. కాగా, అంతర్జాతీయ పరిస్థితులపై ఆర్బీఐ గవర్నర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పలు సవాళ్లు ఎదురవుతున్నాయని, వృద్ధికి ఆటంకం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 6.9 శాతంగా నమోదు కావొచ్చని అంచనా వేశారు. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరల్లో పెరుగుదల ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపించవచ్చని ఆర్బీఐ గవర్నర్ అభిప్రాయ పడ్డారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణం 4.6 శాతంగా ఉండొచ్చన్నారు. అలాగే ఏప్రిల్ 3వ తేదీ నాటికి భారత ఫారెక్స్ నిల్వలు 696.1 బిలియన్ డాలర్లు అని పేర్కొన్నారు. మరోవైపు దేశీయ వినియోగం బలంగా ఉందని, పెట్టుబడులు పెరుగుతున్నాయని తెలిపారు.

# తెలంగాణలో మరో రెండు ఎయిర్‌పోర్టులు

(మొదటి పేజీ తరువాయి)

ఆదిలాబాద్‌లో రక్షణ శాఖకు చెందిన 360 ఎకరాల్లో నూతన ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి రామ్మోహన్ పేర్కొన్నారు. ఈ విమానాశ్రయాన్ని రక్షణ శాఖ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. రక్షణ శాఖకు సంబంధించి శిక్షణ కోసం ఈ విమానాశ్రయాన్ని వినియోగించు కోవాలని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదించినట్లు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. అదే విమానాశ్రయంలో పౌర విమానయాన శాఖ టెర్మినల్ నిర్మాణం చేసుకునేందుకు రక్షణ మంత్రి అంగీకారం తెలిపారని ఆయన చెప్పారు. రక్షణ శాఖ అవసరాలతోపాటు సాధారణ విమాన సర్వీసులు కూడా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి రామ్మోహన్ తెలిపారు. 17న అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం రక్షణ శాఖ తుది నిర్ణయం తీసుకోను న్నట్లు ఆయన వెల్లడించారు. త్వరలోనే వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణం ప్రారం భం కానుందంటూ తీపి కబురు చెప్పారు. సుమారు 430 ఎకరాలుంటే ఎయిర్ బస్ రాకపోకలకు వీలుగా విమానాశ్రయం ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని చెప్పారు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు. ఇదే విషయంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. వరంగల్ విమానాశ్రయానికి సంబంధించి కేంద్రం కీలక నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఆదిలాబాద్‌లో డిఫెన్స్ ఎయిర్ స్ట్రిప్ ఉందని.. ఆ స్థలంలో నూతన విమానాశ్రయం కట్టాలని చాలాకాలంగా డిమాండ్ ఉందని చెప్పుకొచ్చారు. ఈ విషయంపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్, విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో కలిసి చర్చించినట్లు కిషన్ రెడ్డి తెలిపారు.

# కాళేశ్వరం మోటర్లను దెబ్బతీసే కుట్రలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాదం ఉందని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెపం నెట్టేందుకే ఉద్దేశపూర్వకంగా మోటార్లను పాడు చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ పాలనాపరమైన నిర్లక్ష్యమా లేక కావాలనే చేస్తున్న కుట్రనా అని నిలదీశారు. భారీ మోటార్లు నిరంతరాయంగా నడిచేలా డిజైన్ చేసినవి, పదే పదే ఆపితే తీవ్ర నష్టం తప్పదని హరీశ్‌రావు హెచ్చరించారు. వేల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టులను ఇలా నిర్లక్ష్యంగా వాడటం శోచనీయమని మండిపడ్డారు. చందలాపూర్ సహా ప్యాకేజీ 6, 8, 10, 11, 12 లలో మోటార్ల ఆపరేషన్ తీరు తీవ్ర అభ్యంతరకరమని తెలిపారు. తక్షణమే మోటార్లను పదే పదే ఆన్, ఆఫ్ చేసే అశాస్త్రీయ విధానాన్ని ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్ నిబంధనల ప్రకారం, డిజైన్ కు అనుగుణంగా నిరంతరాయంగా పంపులు నడిపించాలని తెలిపారు. మీ రాజకీయాల కోసం తెలంగాణ రైతుల జీవనాడి అయిన ప్రాజెక్టులతో చెలగాటం ఆడొద్దని హెచ్చరించారు.

## దంచికొడుతున్న ఎండలు

**● 20 జిల్లాల్లో 41 డిగ్రీలకు పైగా.. ● ఖమ్మం జిల్లాలో అత్యధికంగా 41.6**

**● హైదరాబాద్ వాతావరణ కేంద్రం**



**హైదరాబాద్,ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీంతో జనం బయటకు రావాలనే జంకుతున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఒక ప్రకటన విడుదల చేసింది. రెండు ఆవర్తన ద్రోణుల ప్రభావంతో వచ్చే వారంపాటు పొడి వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నది. బుధవారం రాష్ట్రంలోని 20 జిల్లాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపింది.

# ఆరోగ్యం పట్ల అప్రమత్తతతో ఉండాలి

### ఆర్టీసీ సిబ్బందికి ఆరోగ్యం పై అవగాహన

### ఆర్టీసీ తార్నాక ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్



**సత్తుపల్లి, ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆర్టీసీ సిబ్బంది ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉంటూ అవగాహన కలిగి ఉండాలని తార్నాక ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్ ఆర్టీసీ సిబ్బందికి సూచించారు. బుధవారం ప్రజా ప్రభుత్వం ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ ఉద్యోగులకు ఆరోగ్యం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్ కండక్టర్లతో ఆయన మాట్లాడుతూ వ్యాధులు వాటి నివారణ కు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆయన అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క వ్యక్తి జీవనశైలిలో మార్పులు వ్యాయామం యొక్క ప్రాముఖ్యతను ఈ సందర్భంగా ఆయన వివరించారు. మానసిక ఆరోగ్యం రోడ్డు భద్రత ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ సందర్భంగా ఉద్యోగులకు తెలిపారు. మద్యపానం ధూమపానానికి దూరంగా ఉండటం వలన ఆరోగ్యంగా ఉండవచ్చునని ఆయన సందర్భంగా అన్నారు. అత్యవసర పరిస్థితులలో



సిపిఆర్ చేసే విధానం ఆయన ఉద్యోగులకు సూచించారు. ఉద్యోగులు ఉద్యోగ సమయంలో ప్రతి ఒక్కరు మాస్కు ధరించి ప్రమాదాల నుండి దూరంగా ఉండవచ్చునని అన్నారు. ప్రతి ఒక్క ఉద్యోగి ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండటం వలన తన కుటుంబానికి అదేవిధంగా సంస్థకు మార్గదర్శిగా ఉండే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా డ్రైవర్ కండక్టర్లకు మరియు హైర్ బస్ డ్రైవర్లకు బిపి పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ఎస్ సాహితి, హెల్త్ వాలంటీర్ నాగభూషణం, వెల్ఫేర్ కమిటీ సభ్యులు సైదిరెడ్డి, ఏడీసీలు, సూపర్వైజర్లు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎంపీడీవో కార్యాలయంలో వారాంతపు సమీక్ష సమావేశం

### త్రాగునీరు, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి హామీపై అధికారుల దృష్టి



**కల్లూరు, ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం వారాంతపు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో త్రాగునీటి సమస్యలు, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, ఇందిరమ్మ ఇళ్లు పథకం, ఉపాధి హామీ పథకం, శానిటేషన్ తదితర అంశాలపై పంచాయితీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి పుష్పలత మాట్లాడుతూ గ్రామాల్లో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా త్రాగునీటి సమస్యలు ఉన్నట్లయితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కార్యదర్శులకు సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించిన దరఖాస్తుల గడువు బుధవారంతో ముగిసిన నేపథ్యంలో, దరఖాస్తుదారులు తమకు సంబంధించిన అవసరమైన ధ్రువపత్రాలను రేపటిలోగా ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్, విద్యార్హత సర్టిఫికెట్లు, అనుభవ పత్రాలు, డ్రైవింగ్‌కు సంబంధించిన వారు లైసెన్స్, వ్యవసాయం లేదా పశుపోషణకు దరఖాస్తు చేసిన వారు పట్టాదారు పాస్ పుస్తకం నకలు తదితర పత్రాలను తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. గతంలో దరఖాస్తు చేసిన వారు ఏవైనా పత్రాలు మరిచిపోయి ఉంటే వాటిని కూడా రేపటిలోగా సమర్పించాలని పేర్కొన్నారు. అలాగే ఆన్లైన్‌లో దరఖాస్తు చేసి పూర్తి పత్రాలు సమర్పించని వారి పేర్లు సెలెక్షన్ కమిటీ పరిగణనలోకి తీసుకోబడవని ఎంపీడీఓ హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన తాజా మార్గదర్శకాలు, మార్పులు, మినహాయింపులపై సమావేశంలో అధికారులకు వివరించారు. మండల ప్రత్యేక అధికారి పుష్పలత, ఏఈలు, హౌసింగ్ అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, మున్సిపాలిటీ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.


# ఖమ్మం రూరల్ కేజీబీవీ పాఠశాల ఆకస్మిక తనిఖీ

### రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యులు



**ఖమ్మం, ప్రతినిధి ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లాలో పర్యటిస్తున్న తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఖమ్మం రూరల్ కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో విడివిడిగా మాట్లాడి, వారికి అందుతున్న సౌకర్యాలు, విద్యా స్థాయి, మరియు వారి సమస్యల గురించి తెలుసుకున్నారు. పిల్లలకు బాలల హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన కల్పిస్తూ, వారి పరిజ్ఞానాన్ని కూడా పరిశీలించారు. తరగతి గదులు మరియు వసతి గృహాన్ని సందర్శించిన కమిషన్ సభ్యులు, విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. **'చిన్నారి' కార్యక్రమంపై ప్రశంసలు** స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా శక్తి కేంద్రాలు మరియు జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా అమలు చేస్తున్న 'చిన్నారి' కార్యక్రమంపై కమిషన్ సభ్యులు వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పాఠశాలలు, కళాశాలల్లోని బాలికలకు లైంగిక దుర్వినియోగాలపై అవగాహన కల్పించడం, రక్షణ చర్యలను తెలియజేయడం వంటి చర్యలను అభినందించారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నందుకు జిల్లా కలెక్టర్ శ్రీ అనుదీప్ దురిశెట్టి, అడిషనల్ కలెక్టర్ కుమారి శ్రీజ మరియు జిల్లా యంత్రాంగాన్ని కమిషన్ సభ్యులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యులు శ్రీమతి చందన, సరిత, జిల్లా సంక్షేమ అధికారిని శ్రీమతి వేల్పుల విజేత, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రామరావు , జిల్లా విద్యా శాఖ అధికారి చైతన్య జైని, జిల్లా బాలల సంరక్షణ అధికారి విష్ణు వందన, జిల్లా హబ్ కోఆర్డినేటర్ సమ్రీన్, రఘునాధపాలెం ఎంపీడీవో ఆషిక్ కుమార్, ఖమ్మం అర్బన్ సిడిపిఓ వీరభద్రమ్మ, ఖమ్మం రూరల్ సిడిపిఓ కమల ప్రియా, జిసిడివో రూబీలు పాల్గొన్నారు.

# తలసేమియా రహిత తెలంగాణే మా లక్ష్యం




### - సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ
### - సేవే లక్ష్యం... చిన్నారుల కోసం ముందుకొచ్చిన దాతలు
### - ఈ ఏడాది కూడా నెల రోజుల పాటు తలసేమియా వ్యాదిపై అవగాహన కార్యక్రమాలు
### - ఖమ్మంలో రక్తదాన శిబిరం ప్రారంభం

**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తలసేమియా రహిత తెలంగాణే మా లక్ష్యమని, వ్యాధి రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ బాధ్యులు పిలుపునిచ్చారు. మే 8న ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకొని, నెల రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన అవగాహన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఖమ్మంలోని రీతన్య ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తలసేమియా బాధిత చిన్నారులకు ప్రాణాధారమైన రక్తాన్ని అందించేందుకు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ప్రారంభమైంది. ఈ శిబిరాన్ని సీఎస్‌బీ ఏసీపీ టి. మహేష్, ఏఆర్ ఏసీపీ నరసయ్య, సీసీఎస్ ఏసిపి సర్వర్, సీఎస్‌బీ సీఐ రాజిరెడ్డి ప్రారంభించారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల తల్లిదండ్రులు, బంధువులతో పాటు ఎస్సీ సంక్షేమ శాఖ వసతి గృహ విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సీఎస్‌బీ ఏసీపీ టి. మహేష్ మాట్లాడుతూ.. తలసేమియా చిన్నారుల కోసం రక్తదాతలు ముందుకొచ్చి రక్తదానం చేయడం అభినందనీయం అన్నారు. సమాజంలో తోటి వారికి సేవ చేయాలనే సంకల్పం ప్రతి ఒక్కరిలో రావాలని కోరారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగస్వాములం కావడం ఆనందంగా ఉందని, చిన్నారులకు అవసరమైన సమయాల్లో తాము రక్తదానం చేస్తామని తెలిపారు. అనంతరం ప్రముఖ వైద్యులు డాక్టర్ డి.నారాయణ మూర్తి, సంస్థ బాధ్యులు ప్రొద్దుటూరి రవిచందర్ మాట్లాడుతూ... ప్రతి ఏటా ఏప్రిల్ 8 నుండి మే 8 వరకు తలసేమియా వ్యాధి నిర్మూలనకు, ప్రజల్లో చైతన్యం కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా నెల రోజుల పాటు వ్యాదిపై అవగాహన కార్యక్రమాలతో పాటు చిన్నారులకు అవసరమైన వైద్య పరీక్షలు, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా వేసవి కాలంలో తలసేమియా చిన్నారులకు రక్తం దొరకడం కష్టతరమవుతోందని, ఈ ఇబ్బందులను అధిగమించేందుకు ముందస్తుగా ఈ ప్రచార కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఈ ఏడాది 'తలసేమియా రహిత తెలంగాణ నిర్మాణం' అనే నినాదంతో గ్రామ గ్రామాన అవగాహన కల్పిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. సీఎస్‌బీ ఏసీపీ టి. మహేష్, సీఎస్‌బీ సీఐ రాజిరెడ్డి లు తలసేమియా చిన్నారుల వైద్య సహాయం కోసం చెరో రూ.10 వేలు ఆర్థిక సహాయం సంస్థకు అందజేశారు.




# మహిళ శిశు సంక్షేమానికి ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**గంగాధర ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ఈరోజు మధురనగర్ లోని ప్రజా కార్యాలయంలో చొప్పదండి నియోజకవర్గం లోని 140 మంది అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం. తెలంగాణ రాష్ట్రంలోని మహిళా శిశు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల కోసం రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ ఫోన్లను సరఫరా చేసింది. కాగా బుధవారం మధురానగర్ లోని ప్రజా కార్యాలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొప్పదండి నియోజకవర్గం లోని 140 మంది అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్ లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో సిబ్బంది హాజరు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని ఆన్లైన్లో నమోదు చేయడానికి స్మార్ట్ ఫోన్ లను సక్రమంగా వినియోగించాలని అంగన్వాడీ టీచర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో గంగాధర ప్రాజెక్ట్ సిడిపివో సల్వాజి నర్సింగారాణి, గంగాధర తాసిల్దార్ అంబటి రజిత, ఎంపీడీవో రాము, అంగన్వాడి సూపర్వైజర్లు సంతోషి, రేణుక, సుధారాణి, మస్రత్, మిషన్ వాత్సల్య సామాజిక కార్యకర్త కవిత దేవి తదితరులు పాల్గొన్నారు.

# 4వ వార్డులో డ్రైనేజ్ శుభ్రత పనుల పరిశీలన

### ● మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్



**కల్లూరు, ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్)** :మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో ప్రజలకు మెరుగైన పారిశుధ్య సౌకర్యాలు అందించేందుకు చేపడుతున్న డ్రైనేజ్ శుభ్రత పనులను బుధవారం మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ ప్రత్యక్షంగా పరిశీలించారు. వార్డులో జెసిబి యంత్రం ద్వారా నిర్వహిస్తున్న డ్రైనేజ్ క్లీనింగ్ పనులను 4వ వార్డు కౌన్సిలర్ భూక్య రాంబాయి తో కలిసి సందర్శించి పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి కూడా పాల్గొని శుభ్రత కార్యక్రమాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా డ్రైనేజ్ వ్యవస్థను శుభ్రంగా ఉంచడం మున్సిపాలిటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో డ్రైనేజ్‌లలో మురుగు పేరుకుపోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి వార్డులో ప్రత్యేక శ్రద్ధతో శుభ్రత కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రజల ఆరోగ్య రక్షణ దృష్ట్యా పారిశుధ్యంపై మున్సిపాలిటీ ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. అలాగే అధికారులు, సిబ్బంది పనులను నాణ్యతగా పూర్తి చేయాలని, ఎక్కడైనా డ్రైనేజ్ సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ 16 వార్డ్ కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు, యాస శ్రీకాంత్, సిబ్బంది, స్థానిక నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఎన్యూజే జాతీయ సెమినార్ పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ డా.శబరీష్




**మహబూబాబాద్ జిల్లా,ఏప్రిల్ 08(పి.సి.డబ్ల్యూ న్యూస్):** నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఇండియా జాతీయ సమావేశాల ఈ నెల 23,24 తేదీలలో హైదరాబాద్ లో టిఎస్ జె యు ఎన్ యు జే ( I) జాతీయ సమావేశాల దృశ్యా తెలంగాణా స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ మహబూబాబాద్ జిల్లా శాఖ పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ డా.శబరీష్. ఈ సందర్భంగా నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ జిల్లా అధ్యక్షులు చిర్రగొని ఉదయ్ ధీర్, కార్యదర్శి పోతుగంటి సతీష్ ద్వారా యూనియన్ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు,నేషనల్ యూనియన్ ఆఫ్ ఇండియా అనుసంధానంగా తెలంగాణా రాష్టంలో టీఎస్ జేయూ యాంటీ నార్కోటిక్స్ "సే నో టూ డ్రగ్స్ 2కే రన్ " లాంటి అవగాహనా కార్యక్రమాలు చేస్తున్న సేవలను విని ప్రశంసిశీచారు. జర్నలిస్ట్ సంఘాలు సమాజ శ్రేయస్సులో భాగం అవడం ప్రజా ప్రయోజన సమస్యలపై అవగాహన కల్పించడం అభినందనీయం అని, దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి జర్నలిస్ట్ ప్రతినిధులను హైదరాబాద్ వేదికగా తెలంగాణా రాష్ట్ర యూనియన్ ఆతిధ్యం ఇవ్వడం రెండురోజుల సెమినార్ నిర్వహించనుండటం చాలా గొప్ప విషయం అని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న టీఎస్ జేయూ రాష్ట్ర కమిటీ జిల్లా కమిటీలకు అభినందనలు తెలిపారు.

# నూతన వస్త్రాలంకరణ వేడుకకు హాజరైన టియుడబ్ల్యూజే(ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్.

**కురవి ఏప్రిల్ 08(పి.సి.డబ్ల్యూ న్యూస్):** మండలం తట్టుపల్లి గ్రామానికి చెందిన దొంతు బ్రెజిల్–అనూష దంపతుల పుత్రికలు అశ్విత, యశ్విత ల నూతన వస్త్రాలంకరణ, ఒడినింపు వేడుక మహబూబాబాద్ లోని పేరాల కట్టయ్య ఫంక్షన్ హాల్ లో జరగగా హాజరై ఆశీస్సులు అందజేసిన. టియుడబ్ల్యూజే(ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్, గోపా రాష్ట్రనాయకులు బిక్కి వెంకటేశ్వర్లు, జైగౌడ జిల్లా అధ్యక్షుడు వీరన్న తదితరులు పాల్గొన్నారు.



# పల్లెల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం మహిళలే కేంద్రంగా ప్రభుత్వ పథకాల అమలు: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం





**గంగాధర ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం ఇస్లాంపూర్, కోట్ల నరసింహులపల్లి, గర్షకుర్తి రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇస్లాంపూర్, మల్లాపూర్, వెంకంపల్లి, మధురానగర్, చర్లపల్లి(ఎన్), బూరుగుపల్లి, కోట్ల నరసింహులపల్లి, గర్శకుర్తి, కురిక్యాల, గర్శకుర్తి, గట్టుభూత్కూర్ గ్రామాల్లో రూ. 10 లక్షలతో నిర్మిస్తున్న స్వశక్తి సంఘం భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.గర్శకుర్తి లో రూ.10 లక్షలు, వెంకంపల్లి లో రూ.5 లక్షల తో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే. తెలంగాణ రాష్ట్రంలోని పల్లెల అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. బుధవారం గంగాధర మండలం ఇస్లాంపూర్, కోట్ల నరసింహులపల్లి, గర్షకుర్తి రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను, గర్శకుర్తి లో రూ.10 లక్షలు, వెంకంపల్లి లో రూ.5 లక్షల తో నిర్మించిన సిసి రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే ఇస్లాంపూర్, మల్లాపూర్, వెంకంపల్లి, మధురానగర్,చర్లపల్లి(ఎన్)బూరుగుపల్లి, కోట్ల నరసింహులపల్లి, గర్శకుర్తి, కురిక్యాల, గర్శకుర్తి, గట్టుభూత్కూర్ గ్రామాల్లో రూ. 10 లక్షలతో నిర్మిస్తున్న స్వశక్తి సంఘం భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధులు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసిన నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని గాలికి వదిలేసిందని గుర్తు చేశారు. కనీసం గ్రామపంచాయతీలకు సొంత భవనాలను నిర్మించి ఇవ్వలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లెల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. చొప్పదండి నియోజకవర్గం లోని నూతన గ్రామపంచాయతీలో గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలకు నిధులు కేటాయించి, భవనాలను పూర్తి చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళల కేంద్రంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడానికి ప్రతి గ్రామంలో శివ శక్తి సంఘ భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. చొప్పదండి నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, రోల్ మోడల్ గా తీర్చిదిద్దామన్నారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అంబటి రజిత , ఎంపీడీవో రాము, మాజీ సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్ ,సర్పంచులు రామిడి రాజిరెడ్డి,బారాజు ప్రభాకర్ రెడ్డి , వేముల భాస్కర్, గుండా వేణి లావణ్య తిరుపతి ,ఎడవెల్లి విజయ,కాడరి రేణుక కనకయ్య, రాచమల్ల రవి, దూలం కల్యాణ్,గునుకొండ బాబు, రెండ్ల శ్రీనివాస్,బాసవేణి శ్రీనివాస్,దానే అనసూర్య ఒదేలు, బాబ లక్ష్మి మధు, కవిత మల్లేశం, బిర్ల ఆనందం,అరే రాజశేఖర్, నాయకులు దుబ్బాసి బుచ్చయ్య, కర్ర విద్యాసాగర్ రెడ్డి ,మేర్గ కొండయ్య, మంత్రి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అజరయ్య సంస్మరణ సభలో పాల్గొన్న చైర్మన్

**- మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్**



**కల్లూరు, ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలో లింగాల గ్రామ సర్పంచ్ వేము కృష్ణ తండ్రి వేము అజరయ్య ఇటీవల మృతిచెందిన నేపథ్యంలో, లింగాల గ్రామంలోని వారి స్వగృహంలో నిర్వహించిన సంస్మరణ సభలో కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజరయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ వేము అజరయ్య మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. అజరయ్య సేవలను గ్రామ ప్రజలు ఎప్పటికీ గుర్తుంచు కుంటారని అన్నారు. సీనియర్ నాయకులు భాగం ప్రభాకర్ చౌదరి కార్యక్రమంలో పాల్గొని అజరయ్య కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.డాక్టర్ నవ్య కాంత్, కల్లూరు కాంగ్రెస్ నాయకులు యాసా శ్రీకాంత్, నోటి కృష్ణారెడ్డి, రవికు మార్, వాసు, బాల, పాగా బాబురావు, దినకర్ తదితరులు పాల్గొని అజ రయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

**- ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తప్పవు: ఎస్ఐడి హరిత**



**కల్లూరు, ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నమ్మదగిన సమాచారం మేరకు కల్లూరు మండలం వెన్నవల్లి గ్రామ పరిధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి కల్లూరు కు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అధికారులు పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై డి హరిత తెలిపారు. AP`39`SX -9231 నంబర్ గల స్వరాజ్ ట్రాక్టర్‌లో సుమారు 4 టన్నుల ఇసుక లోడుతో తరలిస్తుండగా తనిఖీలు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా గుంజి ఆంజనేయులు, అంగడాల పుల్లయ్య గా గుర్తించారు.విచారణలో భాగంగా వారు ఆంధ్రప్రదేశ్‌లో పర్మిషన్‌తో అమ్మితే టన్నుకు కేవలం రూ.600 మాత్రమే వస్తుందని, తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన కల్లూరులో టన్నుకు రూ.1500 నుంచి రూ.2000 వరకు ధర లభిస్తుండటంతో ఇక్కడికి తీసుకొచ్చినట్లు తెలిపినట్లు అధికారులు వెల్లడించారు.అయితే ఎటువంటి అనుమతి లేకుండా తెలంగాణ రాష్ట్రంలోకి ఇసుక రవాణా చేయడం నేరమని పేర్కొంటూ ట్రాక్టర్‌తో పాటు ఇసుకను సీజ్ చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఐ డి హరిత మాట్లాడుతూ ఇసుక అక్రమ దందాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అక్రమ రవాణాను ఏమాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు.

## మదనపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ

**- ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్**




**ములుగు జిల్లా, ఏప్రిల్08(పీసీడబ్ల్యూ న్యూస్):** మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనతో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ గారు 25 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు చైర్మన్ రవిచంద్ర గారు మాట్లాడుతూ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు తమ గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని రవిచందర్ గారు సూచించారు.ఈ కార్యక్రమం లో చింతనిప్పుల బిక్షపతి, నల్లెల్ల భరత్ కుమార్, జన్ను రవి, జక్కుల రేవంత్ యాదవ్, ఎండీ కుతుబుద్దిన్, అభినయ్ చారి మరియు ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎంఐఎం అధినేతపై, ఎమ్మెల్యేలపై, సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోండి

**హిందూ ముస్లింల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే విధంగా.. దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారు**

**పోలీసు కమిషనర్‌కు ఎంఐఎం మహిళా నాయకురాళ్ల ఫిర్యాదు**



**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 08(పిసిడబ్ల్యూ న్యూస్):** గత కొద్ది రోజులుగా సోషల్ మీడియా వేదికగా ఇన్స్టాగ్రామ్, ఫేస్బుక్, వాట్సాప్ గ్రూపులలో.. ఎంఐఎం పార్టీ పరువు ప్రతిష్టలు దెబ్బ తీసేందుకు ప్రయత్నిస్తూ, ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ, ఎంఐఎం శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీని, ఎంఐఎం పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను, నాయకులను ఉద్దేశించి అసత్యాలతో కూడిన అసభ్య పదజాలంతో, ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ ద్వారా వీడియోలను రూపొందించి, లేనిపోని అభూతాకల్పనలు సృష్టించి, సుమారు15మందికి పైగా వ్యక్తులు ముఠాగా ఏర్పడి దుష్ప్రచారానికి తెర లేపుతున్నారని ఆరోపిస్తు, బుధవారం ఎంఐఎం పార్టీ మహిళా నాయకురాళ్లు, కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలంను కలిసి, లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా మాజీ కార్పొరేటర్ రాఫియ సుల్తాన మాట్లాడుతూ.. .ప్రస్తుతం పశ్చిమబెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రచారానికి వెళ్లిన తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీని, బిజెపి పార్టీ ఏజెంట్, బ్రోకర్ అని చిత్రీకరించి, దుష్ప్రచారానికి పాల్పడుతూ, అసభ్యకరమైన వీడియోలను క్రియేట్ చేసి సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేస్తున్న వారిని, షేర్ చేస్తున్న వారిని, లైక్ చేస్తూ, ప్రోత్సహిస్తున్న సుమారు15మందిని గుర్తించి, వారి పేర్లతో సహా పోలీసు కమిషనర్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తాము ఫిర్యాదు చేసిన వ్యక్తులను, ముందు వరుసలో పెట్టి, ఇతర పార్టీలకు చెందిన కొందరు బడా నాయకులు, ఓప్రజాప్రతినిధి ఉన్నారని, ఇలాంటి నీచపు పనులకు పాల్పడుతూ, దిగజారుడు రాజకీయాలు చేస్తున్న వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు. హిందూ ముస్లింల మధ్య వైశ్యామ్యాలను రెచ్చగొట్టే విధంగా కుట్రలు చేస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న దేశంలో, తెలంగాణ రాష్ట్రంలో, కరీంనగర్ పట్టణంలో హిందూ, ముస్లింల మధ్య చిచ్చు రేపే విధంగా ప్రయత్నిస్తున్నారు. వారి గౌరవ మర్యాదలకు, పరువు ప్రతిష్టలకు భంగం కలిగే విధంగా వీడియోలను పోస్టులు చేస్తూ షేర్ చేస్తున్న వీరూ, ఎంఐఎం పార్టీని తమ పార్టీ నాయకులను ప్రజాప్రతినిధులను రాజకీయంగా దెబ్బతీసి, దిగజార్చే విధంగా కుట్రలకు పాల్పడుతున్న ఈ ముఠా సభ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో 60వ డివిజన్ కార్పొరేటర్ నసీం సుల్తాన, మాజీ కోఆప్షన్ సభ్యురాళ్లు రాఫియా సుల్తాన, ముంతాజ్ బేగం, ఇటీవలే పోటీచేసిన అభ్యర్థులు అయేషా ఫాతిమా, కొమ్ముల రామేశ్వరీ, అన్నేమల్ల అనూష, మాజీ కార్పొరేటర్ లింగంపల్లి సుజాత, తజిన్ ఫాతిమా పాల్గొన్నారు.

# బిజెపి,బీఆర్ఎస్ పార్టీలు చెత్తతో చెత్త రాజకీయాలు చేస్తున్నాయి...

**- పాడి కౌశిక్ రెడ్డి,బండి సంజయ్ కుమార్ డబుల్ డ్రామాలు.**

**- మానర్ రివర్ ఫ్రంట్ కోసం మానేర్ చుట్టూ తిరిగిన గంగులకు డంపు యార్డు కనబడలేదా.?**

**- కరీంనగర్లో చెత్త పేరుకు పోవడానికి కారణం బిఆర్ఎస్,బిజేపి ప్రభుత్వాలు కాదా.**

**- ఏడేళ్లు ఎంపీగా,రెండేళ్లు కేంద్రమంత్రిగా బండి సంజయ్ కుమార్ చేసింది ఏంటి...**

**- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తీవ్ర విమర్శలు...**



**కరీంనగర్,ఏప్రిల్08(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ లో డంపు యార్డు విషయంలో బిజెపి, బీఆర్ఎస్ రెండు పార్టీలు చెత్తతో చెత్త రాజకీయాలు చేస్తున్నాయని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో స్మార్ట్ సిటీ నిధులలో కోట్ల రూపాయలు కొల్లగొట్టి అవినీతి పాలన చేశారని మండిపడ్డారు. కరీంనగర్ లో గుట్టలు గుట్టలుగా చెత్త పేరుకు పోవడానికి ప్రధాన కారణం గత బిఆర్ఎస్ పార్టీ అసమర్ధ పాలన కాదా అని నరేందర్ రెడ్డి ప్రశ్నించారు. గత ఏడాదిజనవరి 24 న కేంద్ర పురపాలక శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో తెగ హడావిడి చేసి డంపు యార్డ్ సమస్యకు పరిష్కారం చూపుతామన్న బండి సంజయ్ కుమార్ ఇప్పుడు డంపు యార్డు విషయంలో రెండు నాలుకల ధోరణి అవలంబిస్తున్నారని నరేందర్ రెడ్డి మండిపడ్డారు. చెత్తను తరలిస్తామని అడ్డగోలు హామీలు ఇచ్చి మున్సిపల్ ఎన్నికల్లోనూ ఓట్లు దండుకున్నారని ఆరోపించారు. కరీంనగర్లో ఒకటి హుజురాబాద్ లో మరొకటి మాట్లాడుతూ డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ లోని డంప్ యార్డ్ లో చెత్తను తొలగించే విషయంలో బండి సంజయ్ కేంద్రం నుంచి ఒక్క రూపాయి అయినా తెచ్చారా అని నరేందర్ రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వాటాను దాచి కరీంనగర్ ను కేంద్రమే అభివృద్ధి చేస్తుందని అబద్ధాలు చెప్పారని, ఇప్పటికైనా ప్రజలకు భ్రమలు కల్పించడం మానుకోవాలని అన్నారు. హుజురాబాద్ లో బీఆర్ఎస్ బిజెపి నేతలు దీక్షల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని, ఉరేసుకొని చస్తామంటూ పల్టీలు కొడుతున్నారని విమర్శించారు. బిఆర్ఎస్,బిజేపీ పార్టీల వారిని ప్రజలు ఉరికించి కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని నరేందర్ రెడ్డి హెచ్చరించారు.బీఆర్ఎస్ నేతలు ఉరేసుకోవాల్సిన అవసరం లేదని, ప్రజలే ఉరివేస్తారని అన్నారు. కరీంనగర్ లోని డంప్ యార్డు లో చెత్తను పూర్తిగా తొలగించి వెస్ట్ ఎనర్జీ ప్లాంట్ ద్వారా ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి ఎటువంటి నిల్వ లేకుండా చేయాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఇచ్చిన హామీని సీఎం రేవంత్ రెడ్డి నెరవేరుస్తారని అన్నారు. చెత్త నిల్వ లేనప్పుడు అది సిర్పపల్లి లో ఏర్పాటు చేసిన ఎక్కడ ఏర్పాటు చేసినా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగవని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.ఇప్పటికైనా డంప్ యార్డ్ విషయంలో బిజెపి బీఆర్ఎస్ చేస్తున్న కుట్రలను ప్రజలు తిప్పి కొట్టాలని నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ విలేకరుల సమావేశంలో తాజొద్దీన్,పిట్టల రవీందర్,కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి,వరాల నర్సింగం,పర్వతం మల్లేశం,కాంతాల జగన్ రెడ్డి,నాయకులు గుండాటి శ్రీనివాస్ రెడ్డి,సరిల్ల ప్రసాద్,ఇక్రమ్ సిఖిందర్,కొట్టె ప్రభాకర్,ఖలీల్,దేవేందర్ పటేల్,హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

**పంట మార్పిడిపై రైతులు దృష్టి పెట్టండి**

**రెగ్యులర్ మార్కెట్ కోసం కృషి**

**ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం**

**ఏఎంసి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి**

**మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్**





**కల్లూరు, ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రైతుల పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుందని ఏఎంసీ భాగం చైర్మన్ నీరజ ప్రభాకర్ చౌదరి, మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ద్వారా కల్లూరు వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను ఏర్పాటు చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రమును ఏఎంసి చైర్మన్ నీరజ ప్రభాకర్ చౌదరి, కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, తాసిల్దార్ బ్రహ్మేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి రూప ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రూప మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు నాణ్యమైన ధాన్యమును తెచ్చి మద్దతు ధర ఏ గ్రేడ్ 2389, కామన్ గ్రేడ్ 2369 రూపాయలు పొందాలని అన్నారు. మండలంలో 90 శాతం దొడ్డు రకం ధాన్యం పండించడం జరిగిందని దిగుబడి కూడా ఆశాజనకంగా ఉందని అన్నారు. రైతులు పండించిన పంటలకు మంచి దిగుబడులు రావాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ నీరజ ప్రభాకర్ చౌదరి, మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చెల్లింపుల్లో మధ్య వర్తుల ప్రమేయం లేకుండా ఆన్లైన్ విధానం తీసుకుని వచ్చి దేశానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు. కనీస మద్దతు ధరలకు రైతులు నుండి ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆన్లైన్ ద్వారా డబ్బులు నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి దాన్యం డబ్బులు జమ చేసే విధంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని అన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర రైతులకు ఎంతో మేలు చేస్తుందని అన్నారు. ఒక వరి పంట మాత్రమే కాకుండా ప్రతి రైతు పంట మార్పిడి విధానంలో అవగాహన కలిగి ఉండాలని కోరారు. వరితో పాటు మామిడి, పామ్ ఆయిల్ పంటలు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని అన్నారు. ప్రతి గ్రామము నుండి రెగ్యులర్ మార్కెట్ కోసం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లి అది సాధించుకోవాలని అప్పుడు ఎక్కువ ఉపాధి దొరుకుతుందని రెగ్యులర్ మార్కెట్ రావడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, ఎక్కువ మందికి ఉపాధి కలుగుతుందని అన్నారు. కల్లూరు ఏఎంసీ కి 5 కోట్ల 44 లక్షలు టార్గెట్ ఇవ్వడం జరిగిందని సెస్ రూపంలో 6 కోట్ల 20 లక్షలు టార్గెట్ పూర్తి చేసామని జిల్లాలోని కల్లూరు ప్రధమ స్థానంలో నిలిచిందని అన్నారు. మన మండలంలో ఎక్కువగా వరి విస్తారంగా పంటలు పండి దిగుమతి ఎక్కువ అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ బ్రహ్మేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి రూప, మూడు సొసైటీల స్పెషల్ ఆఫీసర్ ఉషారాణి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ హరిప్రసాద్, కల్లూరు సిఈఓ వేలాద్రి, చెన్నూరు సీఈవో వెంకటేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోటేశ్వరి, కౌన్సిలర్లు ఉబ్బన రాంబాబు, భూక్య రాంబాయి, దాసరి సుధారాణి, శీలం కృష్ణారెడ్డి, యాస శ్రీకాంత్, యువజన నాయకుడు దరావత రవికుమార్, ఏఈఓ లు, అధికారులు, దేవరపల్లి శ్రీనివాసరావు,నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# రేణుకుంట ఉప మండల హిందూ సమ్మేళన నిర్వహణ కోసం కమిటీ ఏర్పాటు...




**తిమ్మాపూర్,ఏప్రిల్08(పిసిడబ్ల్యూ న్యూస్):**సంఘ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 26న తిమ్మాపూర్ మండలం రేణికుంట ఉప మండలం లో నిర్వహించనున్న హిందూ సమ్మేళన నిర్వహణ కోసం బుధవారం రోజున కమిటీని ఏర్పాటు చేశారు.ఈ కమిటీకి శ్రీ అభయాంజనేయ సహిత శ్రీ జెటీశ్వర కాశి విశ్వనాథ ఆలయహిందూసమ్మేలనసమితి గా నామకరణం చేశారు. కమిటీ కి అధ్యక్షులుగా దేవరాజు,కార్యదర్శి గా నీలం చంద్ర రెడ్డి. ఉపాధ్యక్షులుగా మల్లెతుల తిరుపతి,ఎలుక ఆంజనేయులుకనకం కొమురయ్య, బిల్ల సంతోష్పిస్క కృష్ణ కిషోర్ ,పురం కిరణ్ ఉప కార్యదర్శిగా లుకర్ర మణికంఠ నీలం జగన్ రెడ్డి,కాల్వ నరేష్ పిస్క భూమేష్,అందే శేఖర్ఉప్పునుట్టి సాగర్., కోశాధికారిగా గాజుల అజయ్ ఖండ సేవ ప్రముఖ్,మహిళా ప్రముఖులు గా మేడిపల్లి సత్యవతి, కొమ్మెర గీతా,నీలం స్వప్న, ప్రచార కార్యదర్శి గానీలం రాంరెడ్డి కార్యవర్గ సభ్యులు మేడిపల్లి జనార్దన్ రెడ్డి,కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి,మల్లెతుల చందు, కాల్వ శ్రీనివాస్ ల నియామకం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సామాజిక సమరత తెలంగాణ ప్రాంత సభ్యులు పుల్లూరి రామారావు హిందూ సమ్మేళన ఆవశ్యకత గురించి వివరించి మాట్లాడారు. దేశానికి ఆత్మ హిందూ ధర్మం, హిందూ సంస్కృతి, హిందూ సమాజాన్ని కాపాడుకోవాలని, హిందువులు ఎదుర్కొంటున్న అనేక సవాళ్లను పరిష్కరించుకోవడానికి ఐక్యమత్యంతో నేడు ముందు కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి హిందువులో ఆత్మవిశ్వాసాన్ని, ఐకమత్యాన్ని నింపడం, దేవాలయ వ్యవస్థ పటిష్టం చేయడం, సమాజంలో సామాజిక సమరతను నిర్మాణం చేయడం, కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడం, స్వదేశీ వస్తువుల వాడకాన్ని ప్రోత్సహించడం, జాతీయ భావాన్ని పెంపొదించడం కోసం హిందూ సమాజం ఐక్యతతో ముందు కొనసాగాలని ఉద్దేశంతో హిందూ సమ్మేళనం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో ఉప సర్పంచ్‌లు ముందంజలో ఉండాలి

**• ఉప సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొట్ల కార్తీక్**



**చిట్యాల ఏప్రిల్ 8 (పీసిడబ్ల్యూ న్యూస్ ):** చిట్యాల మండల కేంద్రంలో ఉప సర్పంచ్ ల సంఘం భూపాలపల్లి జిల్లా కార్యదర్శి బుర్ర వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో చిట్యాల మండల స్థాయి ఉప సర్పంచ్ ల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు బొట్ల కార్తీక్ హాజరై మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఉప సర్పంచ్ లు ముందంజలో ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు ఉప సర్పంచ్ ల ఐక్యతకు క్షేత్ర స్థాయిలో ఉప సర్పంచ్ ల సంఘం నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ కార్తీక్ పిలుపునిచ్చారు.అనంతరం ఉప సర్పంచ్ ల సంఘం భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు గట్టు ప్రదీప్ గౌడ్ మాట్లాడుతూ సర్పంచ్ లతో పాటు ఉప సర్పంచ్ లకు కూడా ప్రత్యేక విధులు అప్పచెప్పాలని ఉప సర్పంచ్ లకు గౌరవ వేతనం ఇవ్వాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు.అనంతరం ఉప సర్పంచ్ ల సంఘం చిట్యాల మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షులు ప్రదీప్ గౌడ్ తెలిపారు అధ్యక్షులుగా గుంటూరుపల్లి ఉప సర్పంచ్ ముద్దన నాగరాజుగౌరవ అధ్యక్షులు. పులి రమేష్ గౌడ్ ప్రధాన కార్యదర్శి. కేంపల్లి శ్రీకాంత్ ఉపాధ్యక్షులు. ఏక్ అనిల్వర్కింగ్ ప్రెసిడెంట్. నల్ల అశోక్ కోశాధికారి. మరి సమ్మక్క అధికార ప్రతినిధి. సిరిపురం నరసింగం.కార్యదర్శి. తిరుపతిఈ కార్యక్రమంలో రేగొండ మండల అధ్యక్షులు ఎల్లండి నరేష్ , టేకుమట్ల ఉప సర్పంచ్ ఖాదర్. తదితరులు పాల్గొన్నారు .

# ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో తెలంగాణకు ఘన విజయం

**కోచ్ కే. అంజయ్యకు శాలువాతో సత్కరించిన జిల్లా ఎస్పీ డా. శబరీష్**



**మహబూబాబాద్ జిల్లా ఏప్రిల్ 08(పి.సి.డబ్ల్యూ న్యూస్):**ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో తెలంగాణకు ఘన విజయం. కోచ్ కే. అంజయ్యకు జిల్లా ఎస్పీ డా. శబరీష్ అభినందనలు తెలియజేశారు.మహారాష్ట్రలోని నాగపూర్‌లో మార్చి 29 నుండి ఏప్రిల్ 3 వరకు నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో తెలంగాణ రాష్ట్రం ఆంటీ సబోటేజ్ చెక్ విభాగంలో విశేష ప్రతిభ కనబరిచింది.ఈ పోటీల్లో తెలంగాణ రాష్ట్రానికి క్రింది విభాగాల్లో పతకాలు లభించాయి:(1)యాక్సెస్ కంట్రోల్ విభాగంలో సిల్వర్ మెడల్ (2.)వీవీఐపీ రూమ్ సెర్చ్ విభాగంలో గోల్డ్ మెడల్(3) వీవీఐపీ వెహికిల్ సెర్చ్ విభాగంలో గోల్డ్ మెడల్ ఈ విజయంతో తెలంగాణ రాష్ట్రానికి దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు వచ్చింది. ముఖ్యంగా, నాలుగు నెలల పాటు చీఫ్ కోచ్ ఎం. రామకృష్ణ (ఎస్పీ, 8వ బెటాలియన్, కొండాపూర్) ఆధ్వర్యంలో కఠిన శిక్షణ అందించబడగా, తెలంగాణ రాష్ట్రం ఆల్ ఇండియా ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను సాధించడం వరుసగా మూడవసారి కావడం విశేషం.ఈ విజయానికి తోడ్పడిన మహబూబాబాద్ జిల్లా బీడీ టీం విభాగానికి చెందిన కోచ్ కే. అంజయ్యను జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డా. శబరీష్ ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ డీఎస్పీ ఎం. శ్రీనివాస్, ఆర్.ఐలు సోములు, టీ. నాగేశ్వర్ రావు, ఆర్.ఎస్.ఐ జి. శేఖర్ పాల్గొన్నారు.

# ఐదవ తరగతి విద్యార్థులు అదృష్టవంతులే...

**- గుర్తురు ప్రైమరీ స్కూల్‌లో గ్రాడ్యూవేషన్ డే**

**- కార్యక్రమాన్ని పాఠశాల యాజమాన్యం నిర్వహించారు**







**తొర్రూరు ప్రతినిధి ,ఏప్రిల్ 8(పీసిడబ్ల్యూ న్యూస్):** ఇది ఒకనాటి గుర్తుర్ పాఠశాల, నేటి పాఠశాలకు ఎంతో తేడా కనిపిస్తుంది. ఒకనాడు ప్రభుత్వ పాఠశాలకు వెళ్లాలంటే అక్కడ ఏం చదువు చెప్తారు అనుకునేవారు. ఇప్పుడు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగనిపిస్తున్నాయి అంటున్నారు విద్యార్థుల తల్లిదండ్రులు. గ్రాడ్యుయేషన్ డే అనేది హయ్యర్ ఎడ్యుకేషన్ వారికి వర్తిస్తుందని అనుకునేవారు. నేటి విద్యార్థులకు ఇంతటి చక్కని అవకాశాన్ని కల్పించిన ఉపాధ్యాయులకు తల్లిదండ్రులే కాకుండా గ్రామస్తులు కూడా గుర్తుర్ పాఠశాల విద్యార్థులకు ఇంతటి మహర్దశ వస్తుందని ఊహించలేదని అంటున్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని గుర్తుర్ గ్రామపంచాయతీ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులకు పట్టాలు అందజేసేందుకు గ్రామ సర్పంచ్ విసం పల్లి కవితా బాలకృష్ణ ఆహ్వానించారు. ఈ సందర్భంగా 5వ తరగతి విద్యార్థులకు పట్టాలను అందిస్తున్న గుర్తురు గ్రామ సర్పంచ్ విస్సంపల్లి కవిత బాలకృష్ణ విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి ప్రసంగిస్తూ ఐదవ తరగతి పాస్ అయి ఆరో తరగతిలో అడుగుపెడుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఇంత గొప్పగా గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని చేసిన ప్రైమరీ స్కూల్ పాఠశాల యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని అన్నారు.మరియు అలాగే ఇంత గొప్పగా ఈ కార్యక్రమం తమ పిల్లలకు చేసినందుకు పేరెంట్స్ కూడా చాలా ఆనందం వ్యక్తం చేశారని పేర్కొన్నారు . ఇలాంటి కార్యక్రమాలు చేయడం చాలా సంతోషం ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోపాటు మండల విద్యాశాఖ అధికారిఎంఇఓ , వందేమాతరం ఫౌండేషన్ యాజమాన్యం మరియు ప్రైమరీ స్కూల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయుల బృందం 6వ వార్డ్ సభ్యులు , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# యువజన అభివృద్ధి కోసం యూత్ ఆఫీసర్ రాంబాబు ఎంతో కృషి చేశారు..

**• జిల్లా యువజన అధికారి రాంబాబు ఆత్మీయ వీడ్కోలు సందర్భంగా మేయర్ కోలగని శ్రీనివాస్.**





**కరీంనగర్,ఏప్రిల్08(పీసీడబ్ల్యూ న్యూస్):**కరీంనగర్ జిల్లాలో యువజన అభివృద్ధి , సంక్షేమం కోసం యువజన అధికారి రాంబాబు ఎంతో కృషి చేశారని , అనేక వినూత్న కార్యక్రమాలను అమలు చేసి, యువతలో అవగాహన,నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో ఆయన ముఖ్య పాత్ర పోషించడంతోనే జిల్లాలో యువజన కార్యక్రమాలు మరింత పురోగతి సాధించాయని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. బుధవారం రోజున కరీంనగర్ లోని మై భారత్ కేంద్ర లో జిల్లా యువజన అధికారి రాంబాబు బదిలీ పై వెళ్తున్న సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని పై వ్యాఖ్యలు చేశారు. యువజన అధికారి రాంబాబు జిల్లాలో చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని, వారి సేవలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు మేయర్ శ్రీనివాస్ చెప్పారు.. రాంబాబు బదిలీ పై బాధ ఉన్నప్పటికీ ,కొత్త స్థానంలో వచ్చేవారు కూడా అదే విధంగా సేవలందించి మరింత విజయాలు కరీంనగర్ యువజన విభాగానికి తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్, ఆర్డిఓ మాట్లాడుతూ సేవాభావంతో,కృషి తో యువతను ముందుకు నడిపించాలనితెలిపారు.ఈ కార్యక్రమంలో మేరా యువభారత్ ప్రోగ్రాం అధికారి బి రవీందర్, కార్పొరేటర్ చంద్ర, కార్పొరేటర్ గాజా రమ శివరాం, యువజన సంఘాల రాష్ట్ర నాయకులు ఉప్పరపల్లి శ్రీనివాస్, ముతునూరి హరీష్,తొర్తి శ్రీనివాస్,స్వామి,విష్ణు వర్ధన్,తాడూరిశివకృష్ణ, అశోక్,లక్ష్మీపతి,తదితరులు పాల్గొన్నారు.



# పెరువంచలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**కల్లూరు, ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మండల పరిధిలోని పేరువంచ గ్రామం లో ధాన్యం కొనుగోలు కేంద్రం ను కల్లూరు మండల తహసీల్దార్ బ్రహ్మేశ్వర రావు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బాగం నీరజా ప్రభాకర్ చౌదరి, సర్పంచ్ కీసర నిర్మల మోహన్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి రూప ప్రారంభించారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజా ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని తెలిపారు. ధాన్యం పండించిన రైతుల కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని అన్నారు. పండించిన పంట దళారుల చేతిలోకి పోయి నష్టపోకుండా గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు చేయుటకు కేంద్రాలను ఏర్పాటు చేశారని అన్నారు. సీనియర్ నాయకులు నారాయణపురం మాజీ ఎంపీటీసీ సభ్యులు అంకిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి కందాల రాజు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ హరి ప్రసాద్, జీపీఓ నాగరాజు, సొసైటీ సిబ్బంది నవీన్, సౌజన్య, సీనియర్ నాయకులు కీసర మోహన్ రెడ్డి, కీసర రవీందర్ రెడ్డి, కీసర శ్రీనివాస్ రెడ్డి, రెవిన్యూ సిబ్బంది, వార్డు మెంబెర్ బడుగు వెంకటేశ్వర రావు, మంచాల మాధవ్ రావు, కోట ఉపేంద్ర రైతులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ వన్ ఎన్నికల్లో గందరగోళం.. బైలా ఉల్లంఘనలపై కీర్తి సంతోష్ రాజ్ ఫైర్..

**భట్రాజు సంఘంలో కొత్త వివాదం..**

**పరిశీలకుడు లేకుండా ఎన్నికలా..**

**స్థానికులను పక్కన పెట్టారా..**

**అంబర్‌పేట్ గ్రూప్ మెసేజ్‌తోనే ఎన్నికలా..**

**బైలా నిబంధనలు ఎక్కడ..**

**పారదర్శకత ఎక్కడ? మళ్లీ ఎన్నికలు జరపాలని డిమాండ్"**

**హైదరాబాద్ వన్‌లో సభ్యులే లేరా? కీర్తి సంతోష్ రాజ్ ఘాటు ప్రశ్న**

**ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు..**

**సంఘ పెద్దల జోక్యం అవసరం..**

**హైదరాబాద్ ఏప్రిల్ 08(పిసిడబ్ల్యూ న్యూస్) :** హైదరాబాద్ వన్ భట్రాజు సంఘం అధ్యక్ష ఎన్నికలు వివాదాస్పదంగా మారుతున్నాయి. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత లేకపోవడం, బైలా నిబంధనలు పాటించకపోవడం వంటి అంశాలపై సీనియర్ జర్నలిస్ట్, సామాజికవేత్త కీర్తి సంతోష్ రాజ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియపై అనేక కీలక ప్రశ్నలు లేవనెత్తుతూ సంఘం పెద్దలు, సభ్యులు స్పందించాల్సిన అవసరం ఉందని ఆయన కోరుతున్నారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా భట్రాజు సంఘానికి చెందిన సభ్యుడిని హైదరాబాద్ వన్ అధ్యక్షుడిగా ఎలా నియమించారనే ప్రశ్న ప్రధానంగా నిలిచింది. సాధారణంగా ఏ జిల్లా అధ్యక్షుడిని ఆ జిల్లాలోని సభ్యులే ఎన్నుకుంటారు. అలాంటప్పుడు ఇతర జిల్లాకు చెందిన వ్యక్తిని హైదరాబాద్ వన్ అధ్యక్షుడిగా ప్రకటించడం ఏ విధంగా సమంజసం అవుతుందని కీర్తి సంతోష్ రాజ్ ప్రశ్నించారు.ఇంకా, హైదరాబాద్ వన్ పరిధిలోనే భట్రాజు కులానికి చెందిన అర్హులైన సభ్యులు లేరా? అనే సందేహాన్ని కూడా ఆయన వ్యక్తం చేశారు. స్థానిక సభ్యులను పక్కన పెట్టి ఇతర జిల్లాలో నివసించే వ్యక్తిని ఎంపిక చేయడం వెనుక ఉద్దేశ్యం ఏమిటని ఆయన నిలదీశారు.ఎన్నికల ప్రక్రియలో అత్యంత ముఖ్యమైన అంశమైన ఎన్నికల పరిశీలకుడి లేకుండా ఎన్నికలు నిర్వహించడంపై కూడా ఆయన మండిపడ్డారు. ప్రతి జిల్లా ఎన్నికల్లో పరిశీలకుడు ఉండాల్సిన అవసరం ఉన్నప్పటికీ, హైదరాబాద్ వన్ లో అలాంటి విధానం ఎందుకు పాటించలేదని ప్రశ్నించారు. ఇదే విధంగా ఇతర జిల్లాల్లో కూడా పరిశీలకులు లేకుండానే ఎన్నికలు నిర్వహించారా? అనే అంశాన్ని స్పష్టంచేయాలని డిమాండ్ చేశారు.అంతేకాకుండా, ఎన్నికల సమాచారం హైదరాబాద్ వన్ లో నివాసముంటున్న సభ్యులకు తెలియజేయకుండా కేవలం అంబర్‌పేట్ గ్రూప్‌లో సందేశం పెట్టి ఎన్నికలు నిర్వహించడం ప్రజాస్వామ్య విధానాలకు విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. సంఘానికి చెందిన ప్రతి సభ్యునికి సమాచారం అందేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకుల పై ఉందని పేర్కొన్నారు.సంఘ బైలాల ప్రకారం, ఆయా జిల్లాల్లో నివసించే సభ్యులనే ఆ జిల్లాలో పదవులకు ఎన్నుకోవాలని నిబంధనలు ఉన్నాయా లేదా అనే విషయాన్ని స్పష్టంగా వెల్లడించాలని కీర్తి సంతోష్ రాజ్ కోరుతున్నారు. ఇతర జిల్లాకు చెందిన వ్యక్తిని హైదరాబాద్ వన్ అధ్యక్షుడిగా ప్రకటించడం బైలా



ఉల్లంఘన కాదా అనే అంశంపై సంఘ పెద్దలు తక్షణమే స్పందించాలని, లేని పక్షంలో కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు.ఈ నేపథ్యంలో, హైదరాబాద్ వన్ లో పారదర్శకంగా, ఎన్నికల పరిశీలకుల సమక్షంలో తిరిగి ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. సంఘంలో ప్రజాస్వామ్య విలువలు కాపాడాలంటే ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి సరైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.ఈ వివాదం భట్రాజు సంఘంలో కొత్త చర్చకు దారితీస్తుండగా, సంఘ పెద్దలు తీసుకునే నిర్ణయం ఇప్పుడు కీలకంగా మారింది.

# విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెకు మద్దతు

**- పర్మినెంట్ చేయాలంటూ టియుసిఐ డిమాండ్**

**- 23 వేల కార్మికుల సమ్మె.. ప్రభుత్వానికి హెచ్చరిక**

**ఖమ్మం, ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు తమ హక్కుల సాధనకోసం బుధవారం సమ్మెబాట పట్టారు. ఈనెల 8 నుంచి ప్రారంభమైన ఈ సమ్మెలో సుమారు 23 వేల మంది కార్మికులు పాల్గొంటున్నారని ట్రేడ్ యూనియన్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రామయ్య తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కార్మికులను ఆర్డిజన్లుగా మార్చే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.



వేసవికాలంలో విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న సమయంలో ఈ సమ్మె రాష్ట్రానికి ఇబ్బందులు కలిగించే అవకాశముందని పేర్కొన్నారు.**కార్మికులకు న్యాయం చేయాలి: ఐక్య పోరాటానికి సిద్ధం** ఖమ్మం నగరంలో నిర్వహించిన టియుసిఐ కార్యకర్తల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించే నిబంధనలు కాంట్రాక్ట్ కార్మికులకూ వర్తింపజేసి వారిని పర్మినెంట్ చేయాలని కోరారు. లేనిపక్షంలో ఇతర రంగాల కార్మికులను కూడా ఐక్యం చేసి రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. నగర కార్యదర్శి కె. శ్రీనివాస్‌తో పాటు దాసు, రామరాజు, శ్రీకాంత్, శోభను, నాగరాజు, ఉపేందర్ తదితర నాయకులు పాల్గొన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను ఎదుర్కొనేందుకు ఐక్య పోరాటమే మార్గమని వారు పిలుపునిచ్చారు.

## జనగణన నమోదు చాలా సులువు https://se.census.gov.inను సందర్శించండి



**- తొలి దశలో మీ ఇల్లు, సౌకర్యాల వివరాలను పూర్తి చేయండి**

**- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి**

**- ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి జనగణన నమోదును వివరించిన కేంద్ర జనగణన అధికారులు**


**- డిజిటల్ విధానంలో ఇల్లు, సౌకర్యాల వివరాలను నమోదు చేసిన కేంద్ర మంత్రి**

**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** జనగణన అధికారుల ప్రమేయం లేకుండానే ఇంట్లో నుండే డిజిటల్ విధానంలో సొంతంగా ప్రతి ఒక్కరూ జనగణన వివరాలను నమోదు చేసుకునే అవకాశం కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఈనెలలో ప్రారంభమైన జనగణనలో భాగంగా తొలిదశలో హౌజ్ లిస్టింగ్ (ఇంటి వివరాలు), హౌజింగ్ సెన్సెస్ (ఇంట్లోని సౌకర్యాల) వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. అందు కోసం https://se.census.gov.in వెబ్ సైట్ సందర్శించాలని సూచించారు. ఈరోజు జాతీయ రిజిస్ట్రార్ జనరల్, జనాభా గణాంకాల కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్, జాయింట్ డైరెక్టర్ దీరజ్ జైన్ తోపాటు ఆ విభాగానికి చెందిన పలువురు ఉన్నతాధికారులు న్యూఢిల్లీలోని కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాసానికి విచ్చేశారు. జనగణనలో భాగంగా తొలిదశలో చేపడుతున్న హౌజ్ లిస్ట్, హౌజింగ్ సెన్సెస్ వివరాలను వివరించారు. తొలిదశలో లోకేషన్ డిటైల్స్, ఒక కుటుంబం ఉండే ఇల్లు, ఆఫీస్, సౌకర్యాల వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంట్లోనుండే స్వీయ ఎన్యుమరేషన్ ను నమోదు చేసుకునేందుకు వెబ్ సైట్ ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బండి సంజయ్ డిజిటల్ విధానంలో సొంతంగా తన ఇల్లు, ఇంట్లోని సౌకర్యాల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.... ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో డిజిటల్ విధానంలో జనగణన నిర్వహించడం శుభపరిణామమని అన్నారు. తద్వారా భారత అభివృద్ధిని మరింత వేగవంతం చేసి, వికసిత భారత్ లక్ష్య సాధనకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. హోంమంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో ఈ మహత్తర జాతీయ కార్యక్రమాన్ని కాగితాలతో పనిలేకుండా డిజిటల్ సాధనాలతో నిర్వహించడం, పౌరులకు స్వీయ-ఎన్యూమరేషన్ అవకాశాన్ని కల్పించడం ద్వారా జనగణన దిగ్విజయవంతం అవుతుందని అన్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ప్రజలు స్వీయ-ఎన్యూమరేషన్ పోర్టల్ ద్వారా తమ వివరాలను సమర్పించేందుకు ముందుకు వస్తుండటం సంతోషదాయకమని చెప్పారు. ప్రతి ఒక్కరూ అధికారిక పోర్టల్ https://se.census.gov.in ను సందర్శించి స్వీయ-ఎన్యూమరేషన్ పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.



## మల్కాపూర్‌లో భూమి కబ్జా విషయంలో కేసు నమోదు....

**కరీంనగర్ రూరల్,ఏప్రిల్08(పీసీడబ్ల్యూ న్యూస్):** కొత్తపల్లి మండలం చింతకుంట పరిధిలోని సర్వే నంబర్ 106 /ఏ లో గల భూమిని తప్పుడు పత్రాలతో కబ్జా చేయాలని ప్రయత్నం చేస్తున్నారని పి. దేవి దాస్ రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకుకొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. చింతకుంట శివారులోని మల్కాపూర్ రోడ్డు పక్కన కలిగిన తన వ్యవసాయ భూమిలో గుర్తుతెలియని వ్యక్తులు బ్లేడు ట్రాక్టర్ తో భూమిని చదును చేసే ప్రయత్నం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో తమ భూమిపై తప్పుడు పత్రాలు సృష్టించిన కొంతమంది వ్యక్తులే మళ్లీ తన వ్యవసాయ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని, ఈ విషయంలో తగిన న్యాయం చేయాలని ఫిర్యాదు దారుడు దేవిదాస్ రావు పోలీసులను కోరారు.



Acp(c)

FORM No-82. A.P.P.M. Order Nos. 470, 500

FIRST INFORMATION REPORT
(Under section 173 & 176 BNSS)

1. Dist. KNR PS. Kothapally Year: 2026 FIR. No. 173/2026 Date:- 02-04-2026

2.(i) Act: BNS-2023 Sections: 329 (3), 126 (2) r/w 3 (5)
(ii) Act: -- Sections: --

3.(a) Occurrence of offence day: Date from: 02-04-2026 Date to:
Time period: -- Time from: 1000 hours Time to:

(b), Information received at PS: 02-04-2026 Time: 20:30 hrs
(c) General Diary reference – Vol-I Time: 20:30 hrs

4. Type of information; Written/oral: Written

5. Place of offence: (a) Direction & distance from PS: South-02 KM Beat No: 02
(b) Sy. No. 106/A, Chinthakunta Village Kothapally Mandal.
(c) If outside of the PS than the name of concerned PS: --
District: --

6. Complainant/Informant (a) Name: Pamraj Devidas Rao
(b) Father/husband's name: s/o P.Govinda Rao
(c) Date of birth: 68 years, (d) Nationality: Indian-Caste: Brahmin
(e) Passport No: -- Date of issue: - Place of issue:--
(f) Occupation: Private employee
(g) Address: r/o Madhapur, Hyderabad, Cell: 9347497046.

7. Details of known/suspected/unknown accused with full particulars (attach separate sheet if necessary)

Accused

(3) unknown persons.

| Physic features deformities and other details of the suspect: | | | | | |
|---|---|---|---|---|---|
| *Sex | *Date/year of birth | *Build | *Height in Cms | *Complexion | *Identification Marks |
| Deformities peculiarities | *Teeth | *Hair | *Eyes | *Habits(s) | *Dress habits |
| *Languages dialect | PLACE OF | | | | |
| | *Burn marks | *Leucoderma | Mole | Scar | Tattoo |
| | | | | | |

These fields will be entered only complainant/informant gives any one or more particulars about the suspect. This will be used only for the purpose of preliminary retrieval to assist I.O.

A database created will subsequently link one suspect in several cases, if any.

A comprehensive and complete data on all fields will again be prepared when any accused is arrested irrespective of previous suspicion.

8. Reasons for delay in reporting by the complainant/informed: No-Delay

9. Particulars of properties stolen/involved (Attach separate sheet, if necessary) --

10. Total value of properties stolen/involved: --

## దానవాయిగూడెంలో ఇందిరమ్మ చీరల పంపిణీ

**● రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు అందజేసిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి**



**ఖమ్మం రూరల్, ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం మంజురుచేసిన ఇందిరమ్మ చీరలను ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రఘురాం రెడ్డి బుధవారం దానవాయిగూడెంలో రేషన్ కార్డులు ఉన్న లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా.. ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా చూస్తోశీదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొండల్ జన్మదినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ హరినాధ బాబు, కార్పొరేటర్ లలితారాణి, చల్లా కృష్ణ, జంగం భాస్కర్, కృష్ణ గౌడ్, భట్టపోతుల కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపసర్పంచ్ సప్పిడి ప్రియాంక -నరేష్ గ్రామ వార్డుల పర్యటన



**చెన్నారావుపేట ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలోని స్థానిక లింగగిరి గ్రామం లో రాజీవ్ నగర్ కాలనీ లోని 2,3 వ వార్డు లను పర్యటించిన గ్రామ ఉప సర్పంచ్ ప్రియాంక నరేష్. స్థానిక సమస్యల పై వార్డులోని కుటుంబాలను అడిగి వివరాలను తెలుసుకున్నారు.ఈ పర్యటనలో భాగంగా తన దృష్టికి వచ్చిన నీటి సమస్య,విధి దీపాల సమస్య,పారిశుద్ధ సమస్య , కొత్త పెన్షన్ ల పై గ్రామ సర్పంచ్ మెడబోయిన రజిత కుమార్ తో వార్డు సభ్యులు తో కలిసి సమస్యల పరిష్కారం కి కృషిచేస్తానని అలాగే ప్రతి రెండు నెలలకు ఒకసారి ఇలాగే పర్యటించి సమస్య ల పరిష్కారానికి కృషి చేస్తానని మాట ఇవ్వడం జరిగినది. ఓట్లకోసం తప్ప ప్రజల సమస్యల కోసం ఈ విధంగా అడగడానికి వచ్చిన వారు లేరని ఈ విధంగా ముందుకెళ్లి గ్రామ సమస్య లను పరిష్కరించాలని స్థానిక ప్రజలు ఉపసర్పంచ్ ని ప్రశంసించారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**నెక్కొండ ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకానిపేట గ్రామానికి చెందిన రాంపెల్లి వేణు గౌడ్ -కావ్య ల వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన నెక్కొండ మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాస్,నర్సంపేట కోర్టు ఏజీపీ అడ్వకేట్ బండి శివకుమార్,నెక్కొండ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి, అలంకానిపేట గ్రామ సర్పంచ్ రాంపెల్లి నిరోష - శ్రవణ్,ఎడ్ల కిష్టయ్యా,చాగంటి తిరుమల్, అఖిల్, ఆకుల ఉప్పలయ్య,కోల నరేష్, ఎడ్ల సురేందర్,ఎడ్ల సందీప్, తదితరులు నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# గుర్తుర్‌లో పూర్తి చేసుకున్న ఒకే ఒక ఇందిరమ్మ ఇల్లు

- మార్చ్ నెలలోనే గృహప్రవేశం పూర్తి
- 4వ బిల్లు కోసం ఎదురుచూస్తున్న ఇంటి యజమాని



**తొర్రూరు ప్రతినిధి ,ఏప్రిల్ 8(పీసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో ఇంటి స్థలం ఉన్నవారికి ఐదు లక్షల రూపాయలు ఇస్తూ గృహ నిర్మాణం చేసుకునేందుకు మొదటి విడతగా 2025 సంవత్సరం జూన్ నెలలో ఇందిరమ్మ ఇల్లు గృహ నిర్మాణం చేసుకునేందుకు అర్హులైన నిరుపేదలకు స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి చేతుల మీదుగా ఇంటి నిర్మాణం పేపర్లను అందించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలోని గుర్తుర్ గ్రామపంచాయతీ పరిధిలో 27 గృహాలు మంజూరు కాగా అందులో 24 గృహాలు నిర్మాణం కోసం ప్రారంభించారు. గత సంవత్సరం జూన్ నెలలో మండల అధికారులు, గ్రామ కార్యదర్శి, నూతన గృహ వారికి కొలతల ప్రకారం ముగ్గులు పోసి వెళ్లారు. గత నాలుగు రోజుల క్రితం గ్రామాలలో ఏర్పాటుచేసిన గ్రామసభలో ఎన్ని గృహాలు ఏ స్థాయిలో పూర్తి చేసుకున్నాయి అనేది కార్యదర్శి ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. గుర్తుర్ గ్రామపంచాయతీ లో ప్రస్తుతం గ్రామపంచాయతీకి అతి సమీపంలో ఇందిరమ్మ గృహ లబ్ధిదారులు తిరునాహరి రేణుక ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ గృహాన్ని పూర్తి చేసుకున్నారు. మార్చి 15వ తేదీన గృహప్రవేశం కూడా అయిపోయినట్లు స్థానిక కార్యదర్శి, ఏ ఈ కి కూడా విషయాన్ని విన్నవించారు. రాష్ట్రంలోని పలు మండలాల్లో గల ఇందిరమ్మ గృహాలు నిర్మాణం చేపట్టిన వారు ఆర్థిక స్తోమతతో గృహ నిర్మాణాన్ని పూర్తి చేసుకోలేకపోతున్న విషయాన్ని గమనించి ప్రభుత్వ అధికారులు కూడా గృహ నిర్మాణాల వారికి గతంలో ఉన్న ఆదేశాలను సడలింపు చేసినట్లు తెలిపారు. గత రెండు రోజుల క్రితం బదిలీపై వచ్చిన నూతన కార్యదర్శి ఎం డి రబ్బాని గ్రామంలోని ఇందిరమ్మ గృహాలను సందర్శించారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం తిరునాహరి రేణుక గృహం పూర్తి అయినట్లు వారు ప్రకటించారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి నాలుగవ బిల్లు మంజూరు చేసే విధంగా అధికారుల దృష్టికి తీసుకు వెళ్తానని అన్నారు.

# బార్ అసోసియేషన్ ఎన్నికల్లో రంజిత్ గెలుపే లక్ష్యం: బీఆర్ఎస్ లీగల్ సెల్ నిర్ణయం

**హనుమకొండ, ఏప్రిల్ 8(పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా బిఆర్ఎస్ లీగల్ సెల్ ఉమ్మడి హనుమకొండ- వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుర్రాల వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ముఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సీనియర్ న్యాయవాది మొలుగూరి రంజిత్‌కు పూర్తి మద్దతు ప్రకటిస్తూ.. గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో పాల్గొని, జైలుశిక్షను కూడా అనుభవిస్తూ తన జీవితాన్ని పణంగా పెట్టిన ఉద్యమకారుడిగా మొలుగూరి రంజిత్ సేవలను సమావేశంలో నాయకులు ప్రశంసించారు. న్యాయవాదిగా ఆయనకు ఉన్న అనుభవం, ప్రజా సమస్యలపై అవగాహన దృష్ట్యా హనుమకొండ బార్ అసోసియేషన్‌కు సమర్థ నాయకత్వం అందించగల వ్యక్తిగా పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో బిఆర్ఎస్ లీగల్ సెల్ సభ్యులు ముక్తకంఠంతో మొలుగూరి రంజిత్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని నిర్ణయించారు. ఉమ్మడి హనుమకొండ-వరంగల్ జిల్లా బిఆర్ఎస్ లీగల్ సెల్ విభాగం తరఫున ఈ నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సమావేశానికి సీనియర్ న్యాయవాది, మాజీ కార్పొరేటర్ వద్దిరాజ్ గణేష్, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి తాళ్లపెల్లి జనార్ధన్ గౌడ్, మాజీ జీపీ తక్కల్లపల్లి శ్యాంసుందర్ రావు, మాజీ పీపీ నబి, సీనియర్ న్యాయవాదులు నారాయణగారి ప్రసాద్, సిద్ధం యుగంధర్, బడికెల వెంకటేశ్వర్ రావు, శ్రీరాం కిరణ్ కుమార్, వసంత్ కుమార్, మిరియాల వేణు పటేల్, మాజీ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, ఎక్స్ పీపీ శ్రీధర్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ బిక్షపతి తదితరులు హాజరయ్యారు.సమావేశంలో పాల్గొన్న నాయకులు, న్యాయవాదులు అందరూ ఒకే స్వరంతో మొలుగూరి రంజిత్ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఆయన విజయం ద్వారా న్యాయవాదుల సంక్షేమం, బార్ అసోసియేషన్ అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. చివరగా, ఈ సమావేశాన్ని విజయవంతం చేసినందుకు బిఆర్ఎస్ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గుర్రాల వినోద్ కుమార్ హాజరైన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా దేవాన్ని రిక్యూర్ క్లినిక్ ప్రారంభోత్సవం

**హనుమకొండ, ఏప్రిల్ 8(పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ నక్కలగుట్టలో సీనియర్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సిద్ధ సుమన్ ఆధ్వర్యంలో దేవాన్ని క్యూర్ క్లినిక్ ఘనంగా ప్రారంభించబడింది.ముఖ్యఅతిథిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు విష్ణువర్ధన్ రెడ్డి విచ్చేసి క్లినిక్ ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ సుమన్ మాట్లాడుతూ మెడ నొప్పి భుజం నొప్పి మోచేయి నొప్పి నడుము నొప్పి అన్ని రకాల ఆర్థరైటిస్ పక్షవాతం మూతి వంకర సెరిబ్రల్ ఫ్యాల్సి సర్వైకల్ స్పాండిలోసిస్ సియాటికా నరం నొప్పి వంటి అన్ని రకాల చికిత్స అందుబాటులో ఉందన్నారు చిన్నపిల్లలకు డిజబుల్డ్ చైల్డ్ ఎవరైతే ఉంటారో వారికి సంబంధించిన కొత్త కొత్త పరికరాలతో స్పెషలైజెడ్ ఎక్విప్మెంట్స్ తో చికిత్స అందించబడుతుందని తెలిపారు చిన్నపిల్లల నుండి మొదలుకొని పెద్ద వయసు వారికి ఎలాంటి ఏజ్ లిమిట్ లేకుండా హనుమకొండ వరంగల్ కాజీపేట ట్రైసిటీస్లో అన్ని రకాల ఫిజియోథెరపీ ట్రీట్మెంట్స్ లేటెస్ట్ ఎక్విప్మెంట్స్ తో అందుబాటులో ఉందని తెలిపారు అత్యాధునికమైన కాంబో తెరపి కూడా నిర్వహిస్తామని తెలిపారు చిన్నపిల్లలకి స్టాండింగ్ టేబుల్ వాకర్ అండ్ ట్రేడ్మిల్ ఉపయోగిస్తూ ట్రీట్మెంట్ అందిస్తామన్నారు సస్పెన్షన్ తెరపి తో సహా మా దగ్గర అన్ని సేవలు అందుబాటులో ఉంటాయని హోం సర్వీసెస్ కూడా అందుబాటులో ఉందని తెలిపారు. ఉదయం 11 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు క్లినిక్ లో సేవలు అందుబాటులో ఉంటాయని ఈ సందర్భంగా తెలిపారు.





# డీఈఓ సీరియస్ మానసపల్లి స్కూల్ భూమి ఆక్రమణపై సంచలనం











**ములుగు జిల్లా , ఏప్రిల్ 8(పీసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని మానసపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న 12వ వార్డు ప్రాథమిక పాఠశాల భూమి ఆక్రమణ వ్యవహారం ప్రస్తుతం స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది. ఒకప్పుడు విస్తారంగా ఉన్న ఈ ప్రభుత్వ పాఠశాల స్థలం, ఇప్పుడు కొంత భాగం ఆక్రమణకు గురైందనే ఆరోపణలు వెలువడటం గ్రామస్తుల్లో ఆగ్రహాన్ని రేపుతోంది.గ్రామస్తుల వివరాల ప్రకారం, పాఠశాల పక్కనున్న ఖాళీ స్థలాన్ని కొందరు వ్యక్తులు గ్రీన్ నెట్‌తో చుట్టి, సరిహద్దులు వేసుకున్నట్టు కనిపిస్తోంది. ఈ భూమి అసలు పాఠశాల పరిధిలో భాగమేనని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. నెలలుగా ఈ ఆక్రమణ కొనసాగుతున్నప్పటికీ, సంబంధిత అధికారుల నుండి తగిన చర్యలు తీసుకోకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ప్రాథమిక విచారణలో సుమారు 17 ఫీట్ల మేర భూమి ఆక్రమణకు గురైనట్లు సమాచారం బయటపడింది. ఇది చిన్న విషయం కాదని, భవిష్యత్తులో పాఠశాల విస్తరణకు ఆటంకంగా మారే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.విచారణలో బయటపడిన కీలక అంశాలుపరిశీలనలో కొన్ని ముఖ్య విషయాలు వెలుగులోకి వచ్చాయి:పాఠశాల హెడ్మాస్టర్ సమ్మయ్య, ఆక్రమణ జరిగిన విషయం అంగీకరించినట్లు సమాచారం“ఈ విషయాన్ని పై అధికారులకు ముందుగానే తెలియజేశాం” అని ఆయన సమాధానం ఇచ్చినట్లు తెలిసిందిఅయినప్పటికీ, సమస్య పరిష్కారం కాలేదనే అంశం ప్రశ్నలు రేకెత్తిస్తోందిమండల విద్యాధికారి (ఎంఈఓ) మల్లయ్యపై కూడా నిర్లక్ష్యం ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయిగ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ,“పాఠశాలల పర్యవేక్షణ బాధ్యత ఉన్న అధికారులే ఇలాంటి అంశాలను పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది” అని విమర్శించారు. పాత రికార్డులు కీలకం?ఈ వివాదంలో పాత రికార్డులు కీలకంగా మారే అవకాశముంది.19902000 కాలానికి చెందిన పాఠశాల భూమి సరిహద్దుల ఫోటోలు, పత్రాలు గ్రామస్తుల వద్ద ఉన్నట్లు సమాచారం. ఈ రికార్డులను పరిశీలిస్తే అసలు భూమి పరిమాణం, సరిహద్దులు స్పష్టమయ్యే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. డీఈఓ సీరియస్ కఠిన హెచ్చరికలుఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) స్వయంగా సంఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.“అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే ముందుగానే ఎందుకు తెలియజేయలేదు?” అంటూ ఉపాధ్యాయులను నిలదీశారు“గ్రీన్ నెట్ లేదా క్లాత్ కట్టి భూమిని స్వాధీనం చేసుకోవడం పూర్తిగా చట్టవిరుద్ధం” అని స్పష్టం చేశారువెంటనే ఆక్రమణ తొలగించాలని, లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారుపాఠశాల ప్రతిష్ట గర్వకారణం మానసపల్లి ప్రాథమిక పాఠశాల సాధారణ పాఠశాల కాదు.ఈ పాఠశాల నుంచి చదివిన అనేక మంది విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుని, ప్రభుత్వ రంగంలో కీలక పదవులు చేపట్టారు.డీఎస్పీలు, పంచాయతీ కార్యదర్శులు, పోస్టల్ శాఖ ఉద్యోగులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు వంటి అనేక మంది ఈ పాఠశాల పూర్వ విద్యార్థులే.ఇలాంటి ప్రతిష్టాత్మక పాఠశాలకు భూమి సమస్యలు రావడం పట్ల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు కూడా స్పందిస్తూ,“ఇలాంటి మంచి పాఠశాలకు సరైన ప్లే గ్రౌండ్ లేకపోవడం బాధాకరం. పిల్లల భవిష్యత్తు కోసం భూమిని కాపాడాల్సిన అవసరం ఉంది” అని సూచించారు. గ్రామస్తుల డిమాండ్లుఈ వ్యవహారంపై గ్రామస్తులు కఠినంగా స్పందిస్తూ, కింది డిమాండ్లు చేస్తున్నారు:పాఠశాల భూమిపై జరిగిన ఆక్రమణను తక్షణమే తొలగించాలిబాధ్యులైన హెడ్మాస్టర్, ఎంఈఓపై కఠిన చర్యలు తీసుకోవాలిఅవసరమైతే సస్పెన్షన్ విధించాలిపూర్తి స్థాయి విచారణ జరిపి నిజాలను వెలుగులోకి తేవాలి చివరగా గ్రామ పెద్దలు స్పష్టం చేస్తూ,“మానసపల్లి అంటే గవర్నమెంట్ ఉద్యోగాల పుట్టినిల్లు అనే పేరు ఉందిడ ఆ ప్రతిష్టను కాపాడుకోవాలంటే ఈ పాఠశాలను, దాని భూమిని కాపాడటం అందరి బాధ్యత” అని తెలిపారు.

# జనగణన కార్యక్రమాన్ని ఖచ్చితత్వంతో పూర్తి చేయాలి

- గృహ సముదాయాల బ్లాక్‌ల గుర్తించి సి.యం.యం.ఎస్. పోర్టల్‌లో నమోదు చేయాలి
- హౌస్ లిస్టింగ్ బ్లాక్‌లకు ఫిజికల్ వెరిఫికేషన్ తప్పనిసరి చేయాలి
- గ్రామ స్థాయిలో ల్యాండ్ మార్క్‌లను స్పష్టంగా నమోదు చేయాలి
- జనగణన కార్యక్రమం, పిఎన్జీ పైప్ లైన్, ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి




**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జనగణన-2027కు సంబంధించి గృహ సముదాయాల బ్లాక్‌లు (హౌజ్ లిస్టింగ్ బ్లాక్‌లు) గుర్తించి సి.యం.యం.ఎస్. (సెన్సస్ మేనేజ్మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్) పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జనగణన కార్యక్రమం, పిఎన్జీ గ్యాస్ పైప్ లైన్, ధ్యానం, మొక్కజొన్న కొనుగొలు కేంద్రాల ఏర్పాటుపై తహశీల్దార్లు, ఎంపిడిఓ లు, మునిసిపల్ కమిషనర్లు, వ్యవసాయ అధికారులతో జిల్లా కలెక్టర్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, హౌస్ లిస్టింగ్ బ్లాక్‌లకు సంబంధించి ఫిజికల్ వెరిఫికేషన్‌ను తప్పనిసరిగా నిర్వహించాలని అన్నారు. గ్రామ స్థాయిలో ల్యాండ్‌మార్క్‌లు, పాఠశాలలు, దేవాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు తదితర గుర్తులను బ్లాక్ వారీగా స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. హౌస్ లిస్టింగ్ బ్లాక్‌కు సంబంధించిన వివరాలు ఖచ్చితమైన సమాచారంతో సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జనగణన 2027 రెండు దశలలో జరుగుతుందని, ప్రస్తుత సంవత్సరం హౌజ్ లిస్టింగ్ కార్యక్రమం, మే 10 నుంచి ప్రారంభం అవుతుందని, ప్రతి ఇంటికి సంబంధించిన వివరాలు సేకరించాలని కలెక్టర్ తెలిపారు. హౌస్ లిస్టింగ్ ప్రకారం జనాభా వివరాల సేకరణ చేయడం జరుగుతుందని, ప్రతి 300 ఇండ్లు 800 జనాభా ఒక బ్లాక్ గా (హెచ్.ఎల్.బీ.) నిర్దేశించి జనాభా లెక్కల చేసేందుకు బృందాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఫీల్డ్ సర్వే సమయంలో మనం వేసుకునే అంచనా కంటే ఎక్కువ ఇండ్లు ఉండే అవకాశం ఉన్నందున అధికంగా ఎన్యుమరేటర్లు నియామకం చేపట్టాలని అన్నారు. పట్టణ ప్రాంతాలలో హెచ్.ఎల్.బీ. లు మరింత పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డుల వారీగా ఏర్పాటు చేయనున్న హెచ్.ఎల్.బీ. పేపర్ మీద రిపోర్ట్ సిద్ధం చేసుకొని ఆన్ లైన్ నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి హెచ్.ఎల్.బీ. పరిధిలో ఉన్న ఇండ్లు, ఏం ఉన్నాయో సరిగ్గా ప్లాన్ సిద్ధం చేసుకోవాలని అన్నారు. హెచ్.ఎల్.బీ. ప్రక్రియ ఎంత పకడ్బందీగా చేసుకోగలిగితే రాబోయే కాలం పాటు జనాభా లెక్కల కార్యక్రమం అంత ప్రశాంతంగా నిర్వహించుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ అన్నారు. గ్రామ పంచాయతీలు, వార్డుల హెచ్.ఎల్.బీ. ఆన్ లైన్ ఎంట్రీ చేయాలని కలెక్టర్ సూచించారు. హెచ్.ఎల్.బీ. నిర్ధారణ పూర్తి చేయాలని, హెచ్.ఎల్.బీ. ఆన్ లైన్ ఎంట్రీ సమయంలో జాగ్రత్తగా ఉండాలని అన్నారు. జనగణన కార్యక్రమం చాలా ముఖ్యమైన అంశమని, దీనిని ఎట్టి పరిస్థితులలో నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. హౌజ్ లిస్టింగ్ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ తో పాటు, వినియోగదారుల సురక్షిత, నిరంతర గ్యాస్ సరఫరాకు పిఎన్జీ (పైప్డ్ నేచురల్ గ్యాస్) గ్యాస్ పైప్ లైన్ వ్యవస్థకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ పిఎన్జీ పైప్ లైన్ ద్వారా గృహాలు, వాణిజ్య సంస్థలు, పరిశ్రమ లకు సహజ వాయువును నేరుగా పైప్ లైన్ ద్వారా సరఫరా చేయడం జరుగుతుందని అన్నారు. పిఎన్జీ పైప్ లైన్ పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పైప్ లైన్ ఏర్పాటుకు అనుమతులను వేగంగా మంజూరు చేస్తామన్నారు. జిల్లాలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలుకు కేంద్రాల ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస మౌళిక సదుపాయాలు, తూకం యంత్రాలు, గన్నీ బ్యాగులు, రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పెద్ద గ్రామాలు, మొక్కజొన్న దిగుబడి ఎక్కువగా వచ్చే చోట సబ్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు వెంటనే చేపట్టాలన్నారు. రైతులు పంటను ఆరబెట్టి, ఎఫ్ఏక్యూ నార్మ్ మేరకు తేమ శాతం వచ్చాకనే కొనుగోలు కేంద్రాలకు తీసుకొని వచ్చే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, సిపిఓ ఏ. శ్రీనివాస్, డిపివో రాంబాబు, ఆర్&బీ ఎస్ఈ యాకుబ్, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీం, మార్కుఫెడ్ జిల్లా మేనేజర్ శ్యామ్ కుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పవన్ శిఖరంలా కనిపించారు

## కర్మయోగిని చూశాను: దర్శకుడు బాబీ

సినిమా రంగంలో రారాజుగా వెలిగినా, నేడు ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నా.. పవన్ కల్యాణ్ వ్యక్తిత్వంలో ఎలాంటి మార్పు రాలేదని ప్రముఖ దర్శకుడు బాబీ కితాబునిచ్చారు.

ఎక్స్ వేదికగా బాబీ స్పందిస్తూ... "ఆయన్ని కలవడానికి వెళుతున్నప్పుడు నాలో చిన్న ఉద్వేగం... గతంలో ఆయనతో పనిచేసిన టైములో అప్పుడే రాజకీయాల్లోకి అడుగుపెట్టిన వ్యక్తి. కానీ ఇప్పుడు... ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ చీఫ్ మినిస్టర్. నేను వెళ్ళేసరికి చిరునవ్వులు చిందిస్తున్న ఒక ఋషిలా కనిపించారు... రాజకీయాల్లో తమ ఆస్తుల్ని పెంచుకున్న వ్యక్తుల గురించి విన్నాం, చూశాం... కానీ అన్ని సౌకర్యాలని వదులుకొని నమ్మిన సిద్ధాంతం కోసం బతుకుతున్న ఆయన నాకు ఒక శిఖరంలా కనిపించారు.

అక్కడ ఉన్నంత సేపు ఆయన నాపై చూపించిన ప్రేమకు ఫిదా అయిపోయాను. చివరగా ఒక్క మాట చెబుతున్నాను... జ్ఞానం కోసం రాజభోగాలు వదిలేసి అడవులు పట్టిన బుద్ధుడిని మనం చరిత్రలో చదువుకున్నాం. జనం కోసం తన సుఖాలన్నీ వదులుకొని నిరంతరం శ్రమిస్తున్న కర్మయోగిని ఇవాళ చూశాను" అని ప్రశంసించారు.





# నా జీవితంలో ఒక బ్రేకప్ ఉంది

## : కృతి శెట్టి


'ఉప్పెన' బ్యూటీ కృతి శెట్టి, 'లవ్ టుడే' ఫేమ్ ప్రదీప్ రంగనాథన్ జంటగా నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' (ఎల్.ఐ.కె) సినిమా విడుదలకు సిద్ధమైంది. విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రమోషన్లలో ఈ ఇద్దరు సెలబ్రిటీలు తమ బ్రేకప్స్ గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారాయి.

కృతి శెట్టి మాట్లాడుతూ... తనకు గతంలో ఒకసారి బ్రేకప్ జరిగిందని వెల్లడించింది. ఈ విషయం తన తల్లికి కూడా తెలుసని, ప్రస్తుతం మాత్రం తాను సింగిల్‌గా ఉన్నానని స్పష్టం చేసింది. అలాగే సోషల్ మీడియాలో తనపై నెగిటివిటీ ప్రచారం చేసే వారిని ఏమాత్రం ఆలోచించకుండా వెంటనే బ్లాక్ చేస్తానని ఆమె క్లారిటీ ఇచ్చింది.


ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ... తన లైఫ్ లో ఒకటి కాదు, చాలా బ్రేకప్స్ జరిగాయని నవ్వుతూ చెప్పాడు. అవతలి వాళ్లే తనను బ్లాక్ చేశారని నిజాయతీగా ఒప్పుకున్నాడు. కాలేజీ రోజుల్లో అమ్మాయిల మెసేజ్‌లకు తాను చాట్ జీపీటీ కంటే వేగంగా రిప్లై ఇచ్చేవాడినని, అంతలా కష్టపడినా చివరకు సింగిల్‌గానే మిగిలిపోయానని సరదాగా వ్యాఖ్యానించాడు.

# 'రాకా'గా అల్లు అర్జున్..

## ఫస్ట్ లుక్‌తో ఫ్యాన్స్‌కు బర్త్ డే ట్రీట్




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే కానుక లభించింది. ఆయన, ప్రముఖ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రానికి 'రాకా' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మేరకు విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఇప్పటివరకు ఉన్న ఊహాగానాలకు తెరదించుతూ, చిత్ర యూనిట్ అధికారికంగా ఈ ప్రకటన చేసింది. ఈ పోస్టర్‌లో అల్లు అర్జున్ గతంలో ఎన్నడూ కనపడని అనూహ్యమైన రూపంలో దర్శనమిచ్చారు. గుండుతో, ఒంటిపై ప్రత్యేకమైన గుర్తులు, చెవిపోగులతో భిన్నంగా కనిపిస్తున్నారు. ఓ క్రూర మృగం లాంటి చేయి ఆయన ముఖాన్ని కప్పి ఉంచడం సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. ఇది ఒక వింత జంతువు లేదా హైబ్రిడ్ జీవిని పోలి ఉండటంతో కథపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. దాదాపు రూ. 800 కోట్ల భారీ బడ్జెట్‌తో పాన్ వరల్డ్ చిత్రంగా దీన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. హాలీవుడ్ స్థాయి సాంకేతిక నిపుణులు విజువల్ ఎఫెక్ట్స్ కోసం పనిచేయనున్నారని సమాచారం. ఈ సినిమాలో అల్లు అర్జున్ సరసన దీపికా పదుకొణే కథానాయికగా నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. వీరితో పాటు రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్, రమ్యకృష్ణ వంటి భారీ తారాగణం కూడా భాగం కానున్నారని వార్తలు వస్తున్నాయి. ఇక 'రాకా' అనే పదానికి రాక్షస శక్తి లేదా క్రూరత్వం అనే అర్థాలు ఉండటంతో, బన్నీ నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపిస్తారా? లేక ఇది ఏదైనా సోషియో-ఫాంటసీ కథాంశమా? అని అభిమానులు, నెటిజన్లు అంచనాలు వేస్తున్నారు. దర్శకుడు అట్లీ చివరి నిమిషం వరకు టైటిల్‌ను గోప్యంగా ఉంచి, నేరుగా పుట్టినరోజున ప్రకటించడంతో ఈ ప్రాజెక్ట్‌పై హైప్ మరింత పెరిగింది.



# నేను అంత తక్కువ వాడినా అనిపించింది

## : హీరో శర్వానంద్ ఆవేదన


టాలీవుడ్ చార్మింగ్ స్టార్ శర్వానంద్ తన కెరీర్‌లో ఎదురైన అత్యంత కష్టమైన దశ గురించి ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆవేదన వ్యక్తం చేశారు. షూటింగ్ సమయంలో జరిగిన ప్రమాదం, ఆ తర్వాత ఎదుర్కొన్న ఒంటరితనం తనను ఎంతగానో కలిచివేసిందని ఆయన వెల్లడించారు.

'జాను' సినిమా షూటింగ్ సమయంలో థాయ్‌లాండ్‌లో స్కైడైవింగ్ శిక్షణ తీసుకుంటుండగా శర్వానంద్‌కు ఘోర ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆయన భుజం ఎముక విరిగిపోయింది. దీని కోసం అత్యంత క్లిష్టమైన సర్జరీ చేయించుకోవాల్సి వచ్చింది. దీని గురించి శర్వానంద్ మాట్లాడుతూ... సినిమా కోసం ప్రాణాలకు తెగించి సాహసం చేసినా, పరిశ్రమలో గానీ, బయట గానీ ఎవరూ పెద్దగా పట్టించుకోకపోవడం తనను బాధించిందని శర్వానంద్ అన్నారు. "పెద్ద హీరోలకు చిన్న దెబ్బ తగిలినా సోషల్ మీడియాలో రచ్చ జరుగుతుంది. కానీ నేను అంత పెద్ద సర్జరీ చేయించుకున్నా ఎవరూ స్పందించలేదు. నేను ఇండస్ట్రీలో అంత తక్కువ వాడినా అనిపించింది" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో ఎదురైన పరిస్థితి తనను మానసికంగా కుంగదీసిందని, తన కష్టానికి తగిన గుర్తింపు లభించలేదనే బాధ ఇప్పటికీ ఉండిపోయిందని పేర్కొన్నారు. శర్వానంద్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆయన పడిన కష్టాన్ని గుర్తించిన నెటిజన్లు, అభిమానులు శర్వానంద్‌కు మద్దతుగా నిలుస్తున్నారు.

# నాని కెరీర్‌లోనే ఫాస్టెస్ట్ హిట్..


# ఆయా షేర్ హిస్టరీ!

నేచురల్ స్టార్ నాని నటిస్తున్న తాజా సినిమా ది ప్యారడైజ్ మరోసారి ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ ఆయా షేర్ రిలీజైన కొద్ది రోజుల్లోనే అద్భుతమైన రికార్డును సొంతం చేసుకుంది. ఈ పాట 100 మిలియన్ వ్యూస్‌ను అత్యంత వేగంగా చేరుకోవడం ద్వారా నాని కెరీర్‌లో కొత్త మైలురాయిగా నిలిచింది. గతంలో నాని సినిమాలకు వచ్చిన సాంగ్స్ కంటే ఈ సాంగ్ అత్యంత వేగంగా ఈ ఫీట్ సాధించడం విశేషం. మాస్ లో పెరిగిన నాని ఇమేజ్ ఈ సాంగ్ లో నాని కనిపించిన రగ్గడ్ అవతార్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. జడల్ అనే పాత్రలో ఆయన చేసిన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఎనర్జిటిక్ డాన్స్ మూమెంట్స్ అభిమానులను మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి. సోషల్ మీడియాలో ఈ పాటకు వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే, నాని మాస్ ఇమేజ్ మరింతగా బలపడిందని స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా యూత్ లో ఈ సాంగ్ భారీగా వైరల్ అవుతూ రీల్స్ రూపంలో ట్రెండ్ అవుతోంది. సక్సెస్ ఫార్ములాగా నాని- అనిరుధ్ కాంబో మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ మరోసారి ఈ సాంగ్ తో తన మ్యాజిక్‌ను చూపించారు. గతంలో అతను అందించిన హిట్ సాంగ్స్ సరసన ఆయా షేర్ కూడా నిలిచిపోయేలా ఉంది. ఈ సాంగ్ బీట్, ఎనర్జీ, మరియు మాస్ ఫీలింగ్ ప్రేక్షకులను థియేటర్లలో ఉర్రూతలూగించేలా ఉండబోతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. నాని- అనిరుధ్ కాంబినేషన్ లో ఇప్పటికే పలు హిట్ సాంగ్స్ రాగా, ఇప్పుడు మరోసారి ఈ కాంబినేషన్ సక్సెస్ ఫార్ములాగా మారిందని ఆయా షేర్ సాంగ్ ప్రూవ్ చేసింది




# వాటికి దూరంగా ఉండండి

## : యువతకు రజనీకాంత్ కీలక సూచన



సూపర్‌స్టార్ రజనీకాంత్ యువతను ఉద్దేశించి అత్యంత కీలకమైన, భావోద్వేగపూరితమైన సందేశాన్ని ఇచ్చారు. సినిమాల్లోని సాహసాలను చూసి నిజ జీవితంలో ప్రమాదకర నిర్ణయాలు తీసుకోవద్దని ఆయన హితవు పలికారు. ప్రస్తుత కాలంలో యువత తప్పుడు మార్గాల్లో వెళ్లడంపై రజనీ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా డ్రగ్స్, మద్యం వంటి భయంకరమైన వ్యసనాలకు బానిసలైతే తమ జీవితాలే కాకుండా, వారిని నమ్ముకున్న తల్లిదండ్రుల జీవితాలు కూడా నాశనమవుతాయని హెచ్చరించారు. "క్రమశిక్షణ లేని జీవితం నరకంతో సమానం" అని ఆయన స్పష్టం చేశారు.

సినిమాల్లో హీరోలు చేసే స్టంట్లు చూసి స్ఫూర్తి పొంది రోడ్లపై బైక్ రేసింగ్‌లు చేయడం ప్రాణాపాయమని, అటువంటి పనులకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థి దశలో చదువుపైనే పూర్తి నిబద్ధతతో ఉండాలని, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని అన్నారు. అలవాట్లు సరిగ్గా లేని స్నేహితులకు దూరంగా ఉండాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యతని గుర్తుచేశారు. తన సినిమాల గురించి మాట్లాడుతూ... అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'జైలర్ 2' షూటింగ్ పూర్తయిందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. అలాగే సిబి చక్రవర్తి దర్శకత్వంలో, కమల్ హాసన్ నిర్మాణంలో రాబోతున్న 'తలైవర్ 173' ప్రాజెక్ట్ విశేషాలను కూడా పంచుకున్నారు.